నేటి కందం- నేటికి అందం

వందనముల నిడి కొలిచెద
స్యందనముల వంటి దౌత్య సంబంధములన్
నందాదేవి,శివాలిక్
సుందరముగ భరత సీమ జొచ్చిన వేళన్ !!

సురక్షితంగా నందాదేవి,శివాలిక్ నౌకలు యల్ పీ జీ గ్యాస్ తో భారత నౌకాశ్రయానికి చేరుకున్న వేళ మన దేశం అనుసరించిన దౌత్య విధానానికి ప్రజలు మోడీకి జేజేలు పలుకుతున్నారు



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

షడ్రుచుల బహుళత్వం
సంస్కృతి మన ఉగాది
భిన్నత్వంలో ఏకత
బంధుత్వమే పునాది
సాంప్రదాయమేదైనా
సమైక్యతే మన హితం
సాగబోదు విస్మరిస్తే
సామాజిక ప్రగతిరథం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ గురువారం 19-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:171 పేజీలు:6 వెల: రూ.1/-







# ఎంపీ పుట్టా మహేశ్‌కి స్టేషన్ బెయిల్ వ్యవహారంలో తమ ప్రమేయం లేదు

## -సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ, మార్చి 18: మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేశ్‌కి స్టేషన్ బెయిల్ వ్యవహారంలో తమ ప్రమేయం లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ డ్రగ్స్ కేసు త్వరితగతిన విచారించడానికే ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం సీఎం రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. 2028లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగవన్నారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ఆయన జోస్యం చెప్పారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందే వస్తే తనకూ సంతోషమేనని పేర్కొన్నారు.

అంతకముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజ్యసభకు ఇటీవల ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని వారికి పరిచయం చేశారు. ఈ పర్యటనలో రేవంత్‌తో పాటు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

# విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం: అశ్వినీ వైష్ణవ్



ఢిల్లీ, మార్చి 18 : విశాఖపట్నం రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈరోజు(బుధవారం) లోక్‌సభలో ఆయన మాట్లాడారు. వైజాగ్‌లోని ముడసర్లోవ వద్ద 52.2 ఎకరాల భూమిని ఆగస్టు 2024లో ఏపీ ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించిందని ప్రస్తావించారు. సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి రూ.106.89 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. 2025 జనవరిలో ఈ జోన్‌కు శంకుస్థాపన జరిగిందని.. ప్రస్తుతం ప్రధాన కార్యాలయ భవన పునాది పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఎఓఖీఆం భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు.

రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025-26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# మురికి కూపంలో జీవిస్తున్న ప్రజల జీవన స్థితి గతులను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది

## -ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, మార్చి 18: తెలంగాణ శాసనసభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. మూసీ ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పందించారు. మురికి కూపంలో జీవిస్తున్న ప్రజల జీవన స్థితి గతులను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. సామాజిక బాధ్యతతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పుకొచ్చారు. 'అక్కడి ప్రజల జీవితాలు మారొద్దని మీరు కోరుకుంటున్నారా. మూసీ అభివృద్ధి జరగవద్దని మీరు చెబుతున్నారా. ప్రతిదానికి అడ్డుపడుతున్నారు. పేదవాళ్లు పేదవాళ్లుగానే ఉండాలని కోరుకుంటున్నారా.. మురికి కూపంలో ఉండేవారు అక్కడే ఉండాలని కోరుకుంటున్నారా. సలహాలు, సూచనలు ఉంటే ఇవ్వండి. మీలాగా ప్రచార ఆర్భాటాలు చేసి వదిలేసే ప్రభుత్వం కాదు మాది' అంటూ కేటీఆర్‌కు ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

### ఆ జీవోనే అమలు చేస్తున్నాం: మంత్రి శ్రీధర్ బాబు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బీఏసీలో చెప్పిన విషయాన్ని వారి సభ్యులకు కూడా చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక ప్రశ్నపైనే సభా సమయాన్ని వృధా చేయొద్దన్నారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్‌ను యుద్ధ ప్రాతిపదికన తాము సిద్ధం చేయలేదని తెలిపారు. 2024 డిసెంబర్‌లో డీపీఆర్ తయారీ కోసం మెయిన్ హార్ట్ కంపెనీకి బాధ్యత అప్పగించామన్నారు. ఫిబ్రవరి 2026లో డీపీఆర్ సిద్ధమైందని చెప్పారు. 50 మీటర్ల బఫర్ జోన్ ఉండాలని 2016లో గత బీఆర్ఎస్ ప్రభుత్వమే జీవో ఇచ్చిందని.. ఆ జీవోనే తాము అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే బోర్డ్ మీటింగ్‌లో ఏడీబీ నుంచి అప్రూవల్ వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఆ సంస్థ ఇవ్వకపోతే మరో సంస్థ ఇస్తుందన్నారు. మెయిన్ హార్ట్ కంపెనీ అనేక పనులు చేసిందని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన ఏ పనినీ తాము ఆపలేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

### మూసీని మురికి కూపంగా మార్చిందే కాంగ్రెస్: కేటీఆర్

మూసీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏ ప్రశ్నకు కూడా మంత్రి సంతృప్తికరమైన సమాధానం చెప్పలేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నిదశల్లో అభివృద్ధి జరుగుతుందో చెప్పలేదన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. మూసీని మురికి కూపంగా మార్చిందే కాంగ్రెస్ అంటూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

# ఇకపై ఇంక్రిమెంట్ రద్దు.. టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్, మార్చి 18: ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది.

ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

# తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్, మార్చి 18: తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా మూసీ నది ప్రాజెక్ట్‌పై తీవ్ర చర్చ జరిగింది. మూసీ పేరిట దోపిడీ జరుగుతోందంటూ సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. 'మూసీ ప్రాజెక్టుకు వేం వ్యతిరేకం కాదు.. ప్రాజెక్ట్ పేరుతో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకం. ఆ దోపిడీకి నిరసనగా మేము వాకౌట్ చేస్తున్నాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. డీపీఆర్ లేదని ఎండి చెప్పారని, కానీ ప్రభుత్వం ఉందని చెబుతోందని ఆరోపించారు. పేదవాళ్లపై ప్రేమను ఒలకబోస్తున్నారని మాజీ మంత్రి అన్నారు. వెలుగుమట్లలో పేదల ఇళ్లను కూల్చేశారంటూ మండిపడ్డారు

ఈ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. 'డీపీఆర్ తయారైందని ఎండీ నరసింహారెడ్డి స్పష్టంగా చెప్పారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. మూసీపై బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదు' అని మంత్రి ఆరోపించారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. 'వెలుగుమట్లపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వెలుగుమట్లపై దమ్ముంటే చర్చకు రావాలి' అంటూ సవాలు విసిరారు. అసలు విషయాలన్నీ తెలిస్తే కేటీఆర్ సభలో కూర్చోవడానికి కూడా సిగ్గుపడాల్సిన పరిస్థితి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు.

# ఢిల్లీలో 4 అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం..

## 9 మంది మృతి, ముగ్గురికి గాయాలు



న్యూఢిల్లీ, మార్చి 18:ఢిల్లీలోని పాలెంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భవనం బేస్మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్‌లో బట్టల దుకాణంతో పాటు కాస్మెటిక్స్ షోరూం కూడా ఉన్నది. అయితే బిల్డింగ్‌లోని టాప్ రెండు ఫ్లోర్లలో ఆ ఇంటి యజమానులు ఉంటున్నారు. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది.

పాలంకు చెందిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. 20 ఫైర్ టెండర్లు, 11 సీఏటీఎస్ అంబులెన్సులు, బీఎస్ఈఎస్ , ఎయిర్ ఫోర్స్ పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఫోరెన్సిక్ బృందం చేరుకున్నది. స్థానిక పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేయాలి : మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, మార్చి 18 :కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా నిర్వహించారు. కిసాన్ మేళాకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిసాన్ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులు , వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ ఆధునిక వ్యవసాయం చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా సందర్శించి రైతులతో ముచ్చటించారు. ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా కిసాన్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

రైతులు, శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.

అధిక సాంద్రత సాగుపై కిసాన్ మేళా..

తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఓ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్ ఆధ్వర్యంలో అధిక సాంద్రత సాగుపై కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ మాట్లాడుతూ.. రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వాణిజ్య పంటలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెయ్యి మంది రైతులు పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

జిల్లా గ్రంధాలయాల చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. రైతు లేనిదే మనుగడ లేదన్నారు. రైతులు నష్టాలకు ఓర్చి భూమిని నమ్ముకొని ఆశలతో బతుకుతారని, వారిని ఎంతైనా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ ఫామ్ సమస్యలను కూడా అధికారుల రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో. రామకృష్ణ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నల్కర్ , ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ , జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, స్థానిక సర్పంచ్లు ,రైతు సోదరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి ప్రియురాలికి రంగులు పూసిన వ్యక్తి.. రైలు పట్టాలపై ఉంచి హత్య

చండీగఢ్, మార్చి 18: హోలీ నాడు ఒక వ్యక్తి తన స్నేహితుడి ప్రియురాలికి రంగులు పూశాడు. దీంతో అతడు ఆగ్రహించాడు. ఈ గొడవ నేపథ్యంలో తన అనుచరులతో కలిసి దారుణానికి పాల్పడ్డాడు. ఆ వ్యక్తికి మద్యం తాగించి రైలు పట్టాలపై ఉంచి రైలుతో ఢీకొట్టించి హత్య చేశారు.హర్యానాలోని పానిపట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మహమూద్‌పూర్ గ్రామానికి చెందిన సంజు ప్రియురాలికి హోలీ రోజున స్నేహితుడైన 23 ఏళ్ల కలు రంగులు పూశాడు. దీంతో సంజు, కలు మధ్య గొడవ జరిగింది.

కాగా, వారిద్దరి మధ్య పాత గొడవ కూడా ఉన్నది. గతంలో సంజు బైక్‌ను కలు తీసుకెళ్లాడు. ప్రమాదం జరుగడంతో ఆ బైక్ దెబ్బతిన్నది. నష్ట పరిహారం గురించి వారిద్దరి మధ్య వివాదం కొనసాగుతున్నది. తాజాగా మార్చి 4న హోలీ రోజు తన ప్రియురాలికి రంగులు పూసిన కలును హత్య చేయాలని సంజు భావించాడు. స్నేహితులైన రాహుల్, విశాల్‌తో కలిసి ప్లాన్ వేశాడు.

మరోవైపు హోలీ సెలబ్రేషన్ తర్వాత కలుతో కలిసి వారు మద్యం సేవించారు. కలుతో ఎక్కువగా మద్యం తాగించారు. మత్తులో ఉన్న అతడ్ని బైక్‌పై పానిపట్‌లోని రైలు పట్టాల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సంజు స్క్రూడ్రైవర్‌తో కలు మెడపై రెండుసార్లు పొడిచాడు. కలు చావకపోవడంతో వారు దారుణానికి పాల్పడ్డారు. అతడి చేతులు, కాళ్లు పట్టుకుని రైల్వే పట్టాల మధ్యలో పడుకోబెట్టి వెళ్లిపోయారు.

# ఏపీలో అకాల వర్షాలు..పిడుగుపాటుకు ఒకరు మృతి

అమరావతి, మార్చి 18:ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం పిడుగులతో అకాల వర్షం కురిసింది. దీంతో తుళ్లూరులో పిడుగుపాటుకు ఒకరు మృతిచెందారు. కృష్ణా జిల్లాలోని ఉయ్యూరు. కంకిపాడు, పెనమలూరులో వర్షం పడింది. విజయవాడలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది.ఏలూరు జిల్లాలోని నూజివీడులో ఓ ఇంటిపై పిడుగుపడింది. ఇంటి టెర్రస్‌పైన పిట్టగోడ పాక్షికంగా దెబ్బతింది. ఢిల్లీ నుంచి విజయవాడకు ప్రయాణికులతో వచ్చిన ఇండిగో విమానం ప్రతికూల వాతావరణం కారణంగా హైదరాబాద్‌కు చేరుకుంది. అల్లూరు జిల్లా జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో పలుచోట్ల వడగళ్ల వాన కురిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షం పడింది. బాపట్ల జిల్లాలో సైతం కురిసిన భారీ వర్షానికి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.


4-9 కిన్నెర




ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగాన సభ
ఉదయ సాహితి, తెలంగాణ
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ కవి, రచయిత, పూర్వ ఉపకులపతి
శాతవాహన విశ్వ విద్యాలయం
ఆచార్య కడారు వీరారెడ్డి గారి
లోకాలోకనం వ్యాస సంపుటి
ఆవిష్కరణ సభ
తేదీ: 22-03-2026 ఆదివారం ఉదయం 10.00 గంటలకు
లలిత కళా వేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ సుద్దాల అశోక్ తేజ, ప్రసిద్ధ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయకవి పురస్కార గ్రహీత
సభాధ్యక్షులు : శ్రీ దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ
విశిష్ట అతిథులు : శ్రీ కళా జనార్ధనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
శ్రీ బైస దేవదాసు సంపాదకులు, నేటి నిజం
గౌరవఅతిథి : ఆచార్య మసన చెన్నప్ప, ప్రసిద్ధ సాహితీ వేత్త, పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి : శ్రీ మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ కవి, టి.వి., సినీ గేయ కవి

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర | మద్దాలి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర | శ్రీమతి కళా శారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

# షడ్రుచులతో జీవితాన్ని ఆసాంతం ఆస్వాదిద్దాం !

## (19 మార్చి "విశ్వావసు ఉగాది పర్వదినం" సందర్భంగా)

ఉగాది లేదా యుగాది అనబడే చంద్ర సౌర క్యాలండర్ లేదా పంచాంగం ప్రకారం దక్షిణ భారత తెలుగు రాష్ట్రాలు, కర్నాటక ప్రజలు ఘనంగా నిర్వహించుకునే నూతన సంవత్సర తొలి రోజు వేడుక. 'యుగ' అనగా 'యుగం' అని, 'ఆది' అనగా 'ప్రారంభ' లేదా 'తొలి' రోజు అని అర్థం. పంచాంగం వివరాల ప్రకారం 60 సంవత్సరాల క్యాలెండర్ లేదా సాకా సంవత్ ప్రకారం, గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం తేదీ 19 మార్చి 2026 రోజున శ్రీ పరాభవ నామ నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్నది. చైత్ర శుక్ల పాడ్యమి శుభ గడియల్లో తెలుగు సంవత్సరాదిగా ఉగాది పర్వదినాన్ని జరుపుకోవడం ప్రతి ఏటా అనవాయితీగా వస్తున్నది.

### ఉగాది పర్వదినాన పరమార్థం:

ప్రతి ఏట మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఈ పండుగ వస్తుంది. 12వ శతాబ్దపు గణితశాస్త్రవేత్త భాస్కరాచార్య ప్రారంభించిన ఉగాది పండుగను కృష్ణావతార సమాప్తి తర్వాత నిర్వహించడం విశేషం. పురాణాల ప్రకారం రాముడు వనవాసం పూర్తి చేసి అయోధ్యకు వచ్చిన శుభ గడియలను ఉగాదిగా భావిస్తారు. విశ్వాన్ని బ్రహ్మ సృష్టించిన తొలి రోజుగా కూడా ఉగాదిని పరిగణిస్తారు.

భారతంలో పలు పేర్లతో యుగాది:

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఉగాది పండుగ జరుపుకుంటూ ఉండగా మహారాష్ట్రలో గుడి పడ్వా, తమిళనాడులో పతండు, అస్సాంలో బిహూ, పంజాబ్‌లో బైసాఖీ, రాజస్థాన్‌లో తపన, మణిపూర్‌లో సాహిబ్ నోంగ్మా పంబ, పశ్చిమ బెంగాల్లో నబ వర్షా, సింధు సమాజంలో చెట్టీ ఛాంద్ పేర్లతో ఉగాదిని జరుపుకోవడం మన భారతీయ సాంప్రదాయం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యవసాయ సీజన్ ప్రత్యేకతగా ఉగాది పర్వదినం జరుపుకుంటున్నాం. ఆనందం, సంపదలు, సమన్వయ సమాజ వేడుకగా ఉగాదికి గుర్తింపు ఉన్నది.

### షడ్రుచుల ఉగాది పచ్చడి పరమార్థం:

ఉగాదితో మొదలై నవరాత్రుల పాటు దుర్గా మాతను పూజించే సంస్కృతి కూడా ఉన్నది. ఈ పర్వదినం రోజున తార మర్ధనంతో స్నానాలు చేసి, తీపి చేదుల కలయికగా షడ్రుచుల ఉగాది పచ్చడి (వేప పువ్వు, మామిడి ముక్కలు, చింతపండు, బెల్లం లేదా చక్కెర, కారం లేదా పచ్చి మిరపకాయ, ఉప్పు)ని తీర్థప్రసాదాల వలె భావిస్తూ తీసుకొని జీవితంలో కష్టసుఖాలను పంచుకునే ధైర్యాన్ని పోగుచేసుకొని, మందిరాల్లో పూజలు చేసి, ఊరు వాడ సంబరాలు చేసుకొని, భక్షాలు లేదా బొబ్బట్లు లాంటి రుచికరమైన పిండి వంటలతో సరదాగా, భక్తి భావనలతో పంచాంగ శ్రవణాలకు హాజరై తమ రాశీ పలాలను తెలుసుకోవడం ఆచారంగా వస్తున్నది.

ఆరు రుచుల ఉగాది పచ్చడి జీవిత పరమార్థాన్ని



వివరిస్తుంది. కష్టాల్లో కుంగడం, సుఖాల్లో పొంగడం సరియైన జీవన విధానం కాదని ఉగాది పర్వదినం బోధిస్తున్నది. ఆశావహ దృక్పథ సుగుణం, పరస్పర సహకార భావన, ఐక్యత, వివేకవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పౌర సమాజం శాంతి సౌభాగ్యాలతో ముందుకు సాగాలని కోరుకుందాం. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు ఓ వరం..

## -ఉచిత బస్సు సౌకర్యం ముఖ్యమంత్రితోనే సాధ్యం..
## -దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్..
## -కలెక్టరేట్ ప్రాంగణంలో ఆత్మీయ కలయిక..
## -దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం..

అమరావతి, మార్చి 18:రాష్ట్ర ప్రభుత్వము దివ్యాంగుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి కోసం నూతనంగా దివ్యాంగ శక్తి పథకాన్ని ఉచిత బస్సు ప్రారంభించటం ముఖ్యమంత్రి కే సాధ్యమని మైనార్టీ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. దివ్యంగ శక్తి పథకం ప్రారంబోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో బుధవారం ప్రత్యేక ఆకర్షణకు చోటుచేసుకుంది. 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన అనంతరం, రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

మంత్రి ఫరూక్ స్వయంగా దివ్యాంగుల మధ్య కూర్చుని, వారితో కలిసి భోజనం చేస్తూ ఆత్మీయంగా మాట్లాడారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు వారికి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. భోజన సమయంలో దివ్యాంగులు తమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకురాగా, వాటిని సానుకూలంగా విన్న ఆయన, తక్షణమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని భరోసా ఇచ్చారు.

భోజనం అనంతరం మంత్రి



ఫరూక్ మాట్లాడుతూ ఈ రోజు మీ అందరితో కలిసి కూర్చుని భోజనం చేయడం నాకు ఎంతో తృప్తినిచ్చిందని. మిమ్మల్ని దివ్యాంగులుగా చూడటం లేదు, నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని అన్నారు. మీ చిరునవ్వులే మా ప్రభుత్వానికి అసలైన బలం." అని తెలిపారు. భోజన సమయంలో మీరు నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నేను స్వయంగా నోట్ చేసుకున్నానని . వీటన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు.

ఇప్పటివరకు ప్రయాణం కోసం మీరు ఇబ్బందులు పడేవారు. కానీ ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా మీరు ఎక్కడికైనా ఉచితంగా వెళ్లవచ్చు అని . ఇది కేవలం పథకం కాదు, మీ ఆత్మగౌరవ ప్రయాణం." అని తెలిపారు శారీరక వైకల్యం మీ ప్రతిభకు అడ్డంకి కాకూడదని . విద్య, ఉపాధి రంగాల్లో మీరు రాణించేలా ప్రభుత్వం అన్ని రకాల మద్దతు ఇస్తుందని . మీలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే మా సంకల్పం అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో మాది సంక్షేమ పాలన అని, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే మా ధ్యేయం.

" అన్నారు. మంత్రి ప్రోటోకాల్ పక్కన పెట్టి తమతో కలిసి సామాన్యుడిలా భోజనం చేయడం పట్ల దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ భోజన కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, రజియా సుల్తానా, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఇతర రెవెన్యూ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు

# దేశంలోని పిల్లలకు పోషకాహారం, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండటం అత్యవసరం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, మార్చి 18: అక్షయపాత్ర ఫౌండేషన్ 500 కోట్ల (5 బిలియన్) భోజనాల పంపిణీ పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో నేడు (మార్చి 17, 2026) నిర్వహించిన వేడుకలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విద్యా లక్ష్యాల సాధనలో భాగంగా 500 కోట్ల భోజనాలను అందించడం అక్షయ పాత్ర ఫౌండేషన్ సాధించిన ఒక అద్భుతమైన విజయమని ప్రశంసించారు. 'పోషణతో, విద్యతో కూడిన భారత్ నుంచి అభివృద్ధి చెందిన దేశం వైపు' అనేది ఈ కార్యక్రమ ఇతివృత్తం. ఇది 2047 నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మించాలనే మన జాతీయ సంకల్పాన్ని సాకారం చేయడంలో ఆరోగ్యవంతమైన, విద్యావం తులైన సమాజం పోషించే కీలక పాత్రను తెలుపుతుందని రాష్ట్రపతి తెలిపారు.

మన పిల్లలకు సురక్షితమైన, ఉజ్వలమైన భవిష్యత్తును అందించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, మనందరి ఉమ్మడి బాధ్యత అని రాష్ట్రపతి అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు, కార్పొరేట్ రంగం, సమాజంలోని ప్రతి విభాగం కలిసికట్టుగా కృషి చేసినప్పుడు మాత్రమే మనం రాబోయే తరానికి బలమైన పునాదిని వేయగలమని అన్నారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మంచి ఆరోగ్యం, పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం అందేలా మనం తప్పక చూడాలని.. ఈ ప్రాథమిక అంశాలే పిల్లల సమగ్ర వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

ఒక వ్యక్తి జీవితంలో లభించే అవకాశాలను నిర్ణయించేది, వారి విజయానికి బాటలు వేసేది విద్య మాత్రమేనని రాష్ట్రపతి శ్రీమతి




ద్రౌపది ముర్ము అన్నారు. ఇది సామాజిక మార్పునకు, సాధికారతకు ఒక ప్రభావ వంతమైన మాధ్యమంగా పనిచే స్తుందని పేర్కొన్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడం ప్రారంభిం చిన క్షణం నుంచే వారిలో సాధికారత, సామర్థ్యాల నిర్మాణ ప్రక్రియ రూపు దిద్దుకోవడం మొదలవుతుందని తెలిపారు. రోజువారీ జీవితంలోని సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, బాధ్యతాయుతమైన, వివేకవం తులైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను, అనుభవాలను పాఠశాల పిల్లలకు అందిస్తుందని అన్నారు. గత 25 ఏళ్లుగా పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ, పిల్లలలో పోషకాహార లోప సమస్యను పరిష్కరించడానికి, వారు విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడానికి నిరంతరం కృషి చేస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను రాష్ట్రపతి అభినందించారు.

దేశ భవిష్యత్తు అయిన మన పిల్లలకు పోషకాహారం, నాణ్యమైన విద్య సులభంగా అందుబాటులో ఉండటం అత్యవసరమని రాష్ట్రపతి అన్నారు. గర్భిణీలకు, పిల్లలకు తగిన పోషణ, మెరుగైన ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం అనేక ముఖ్య కార్యక్రమాలను ప్రారంభించిందని ఆమె తెలిపారు. పీఎం పోషణ్ కింద అమలవుతున్న పాఠశాల మధ్యాహ్న భోజన కార్యక్రమం, తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపేలా చేయడంలో ఒక గొప్ప ప్రోత్సాహకంగా నిరూపితమైందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం ఫలితంగా పాఠశాలల్లో పిల్లల నమోదు, హాజరు, చదువు కొనసాగించే వారి సంఖ్య పెరిగిందని అనేక అధ్యయనాల ద్వారా నిరూపితమైందని పేర్కొన్నారు. పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యాలు, విద్యాపరమైన పనితీరులో కూడా గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని చెప్పారు. 2030 నాటికి పిల్లలందరికీ నాణ్యమైన, సమగ్ర విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న 'సమగ్ర శిక్షా అభియాన్' ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో అక్షయపాత్ర ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తున్నందుకు రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. పిల్లలు కేవలం ఉచిత భోజన పథక లబ్ధిదారులు మాత్రమే కాదని, వారు దేశ ఉజ్వల భవిష్యత్తుకు రూపకర్తలని రాష్ట్రపతి అన్నారు. నేడు వారికి లభిస్తున్న పోషకాహారం.. మన దేశ మానవ వనరులపై పెడుతున్న పెట్టుబడి వంటిదని ఆమె పేర్కొన్నారు. ఆరోగ్యవంతులుగా, విద్యావంతులుగా, ఉత్సాహవంతులుగా ఎదిగే ఈ పిల్లలే భవిష్యత్తులో దేశ శ్రామిక శక్తిగా మారి, 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనలో కీలక పాత్ర పోషిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# యూఏఈ అధ్యక్షునితో మాట్లాడిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ
## పశ్చిమ ఆసియాలో వర్తమాన స్థితి గురించి చర్చ

న్యూఢిల్లీ, మార్చి 18:యూఏఈ అధ్యక్షుడు శ్రీ షేక్ మొహమద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడి, ఈద్ కు ముందస్తు శుభాకాంక్షల్ని తెలియజేశారు. ప్రధానమంత్రి శ్రీ మోదీ, అధ్యక్షుడు పశ్చిమ ఆసియాలో వర్తమాన స్థితిని గురించి కూడా ఈ సందర్భంగా చర్చించారు. యూఏఈ లో అమాయక ప్రజల ప్రాణాలను హరించిన, పౌర మౌలిక సదుపాయాలకు నష్టం కలిగించిన అన్ని దాడుల్నీ భారత్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రధాని శ్రీ మోదీ పునరుద్ఘాటించారు. హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానం సురక్షితంగా, నిరంతరాయంగా కొనసాగేటట్లు చూడడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిందేనని విషయాన్ని ప్రధానమంత్రితో పాటు అధ్యక్షుడు కూడా అంగీకరించారు. ఈ ప్రాంతంలో శాంతి, భద్రతలను, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించేందుకు రెండు దేశాలు కలసి నిరంతరం కృషి చేస్తాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ -

"నా సోదరుడు యూఏఈ అధ్యక్షుడు శ్రీ షేక్ మొహమద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మాట్లాడి, ఈద్ కు ముందస్తు శుభాకాంక్షల్ని తెలియజేశాను.

పశ్చిమ ఆసియాలో వర్తమాన స్థితిని గురించి కూడా మేం చర్చించాం. యూఏఈ లో అమాయక ప్రజల ప్రాణాలను హరించిన, పౌర మౌలిక సదుపాయాలకు నష్టం కలిగించిన అన్ని దాడుల్నీ భారత్ తీవ్రంగా ఖండిస్తోందని నేను పునరుద్ఘాటించాను.

హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానం సురక్షితంగానూ, నిరంతరాయంగానూ కొనసాగేటట్లు చూడడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిందేనని మేం అంగీకరించాం.

ఈ ప్రాంతంలో శాంతి, భద్రతలతో పాటు స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించేందుకు మేం కలసి పనిచేస్తుంటాం" అని పేర్కొన్నారు.

# కల్వర్టు పనులు ప్రారంభించిన సర్పంచ్..



నల్గొండ, 18:కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామం లోని 8వ వార్డ్ లో గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ చేతుల మీదుగా పూజలు నిర్వహించి అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా 8వ వార్డులో నూతనంగా నిర్మించే కల్వర్టు పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తక్కురి ముత్యం,టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్,వార్డ్ సభ్యులు సాదుల్లా, అంజిత్, సురేష్, అనిల్,సంతోష్,సతీష్,అజయ్ గౌడ్ ,వెంకట్,నాయకులు క్రాంతి నజీర్,ఉబేద్ కార్యదర్శి రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు పంటపై రైతులకు అవగాహన..

నల్గొండ, 18: నల్లగొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రం లోని రైతువేదికలో బుధవారం ఆయిల్ ఫామ్ సాగు పంటపై ఆత్మ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆద్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు విచ్చేసిన రైతులను ఉద్దేశించి మునుగోడు ఏ డి ఏ వేణుగోపాల్ మరియు హార్టికల్చర్ అధికారి విద్యాసాగర్ ఆయిల్ పామ్ పంట సాగు చేసే విదానం, అనువైన నేలలు, మార్కెటింగ్ మరియు పంట సాగువలన కలిగే లాభాలను వివరించారు.

ఈ కార్యక్రమ ంలో మండల వ్యవసా య అధికారిణి యం రేవతి, ఏవోలు జి రాకేష్,కార్తీక్,ఉపస ర్పంచ్ ఖమ్మం లక్ష్మయ్య,పోరెడ్డి ముత్తిరెడ్డి, ఘాసిరాం,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు..
## 36 సిలిండర్లు పట్టివేత

దమ్మపేట,మార్చి 18: దమ్మపేటలో హోటళ్లు , ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై బుధవారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించి 36 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. గల్ఫ్ సంక్షోభం కారణంగా పశ్చిమాసియాలో ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో గ్యాస్ సరఫరాలపై దీని ప్రభావం తీవ్రస్థాయికి చేరుకునే ప్రమాదం వున్న నేపథ్యంలో గ్యాస్ పొదుపు గా వాడాలని అధికారులు సూచి స్తున్నప్పటికీ, అడ్డగోలుగా డొమె స్టిక్ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వినియో గిస్తున్నారనే పక్కా సమాచారంతో ఆకస్మిక దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో 36 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి దమ్మపేట లోని చిలకల గండి ముత్యాలమ్మ తల్లి గ్యాస్ గోడౌన్ కు తరలించినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించి డొమెస్టిక్ గ్యాస్ సిలిం డర్లను వ్యాపార సముదా యాలు (హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్) కు వాడుతున్న వారిపై నిత్యావసర వస్తువుల చట్టం సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# రైతులకు ఆదాయంతో పాటు భద్రతకూ గ్యారంటీ
## - లోక్‌సభలో కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, మార్చి 18:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుని రైతుల ఆదాయానికీ, భద్రతకీ అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చిందని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు అన్నారు. ఆ చర్యల్లో.. పొగాకు వంటి హానికర పంటలకు బదులు లాభదాయక ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) కు చరిత్రాత్మక స్థాయిలో సేకరణ చేపట్టడం, పంట బీమా పథకంలో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టడంతో పాటు ఖచ్చితమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయని ఆయన వివరించారు.

లోక్‌సభలో పార్లమెంట్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు శ్రీ చౌహాన్ సమాధానాన్నిస్తూ, కేంద్రం రైతుల్ని పొగాకు సాగును వదిలేయాల్సిందిగా కోరడమే కాకుండా, పొగాకును పండిస్తున్న ప్రాంతాల్లో లాభసాటి, ప్రత్యామ్నాయాలను కూడా గుర్తించిందన్నారు. ఈ ప్రత్యామ్నాయ పంటల్లో మిశ్ర జాతి మొక్కజొన్న, మిరప, చిలగడదుంప, పత్తి, బంగాళదుంప, చియా, ఫీడ్ బీన్స్, , బొబ్బర్లు/అలసందలు, రాగి, ఎర్ర పప్పు, చెరకు, సోయ్‌బీన్, జొన్న, వేరుసెనగ వంటివి కొన్ని.. వీటిని పండిస్తే రైతులకు సంపాదన సురక్షితంగా ఉంటుందన్నారు.దేశంలో ఎక్కువ మంది రైతుల దగ్గర చిన్న కమతాలు ఉన్నాయనీ, ఈ స్థితిలో చిన్న రైతులు కేవలం ఒకే పంటపై ఆధారపడడం నష్టంతో కూడుకొని ఉంటుందనీ కేంద్ర మంత్రి అన్నారు. ఈ కారణంగా ప్రభుత్వం ఏకీకృత సాగు (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్)కు సంబంధించిన అనేక నమూనాలను సిద్ధం చేసి వివిధ రాష్ట్రాల్లో వాటి ప్రదర్శన ప్రక్రియను మొదలుపెట్టిందని ఆయన చెప్పారు. ఈ నమూనాల్లో భాగంగా రైతులు తృణధాన్యాలు (గోధుమ, ధాన్యం), కాయగూరలు, పండ్లు, పశువుల పెంపకం, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, మేకల పెంపకం, వ్యవసాయ క్షేత్రాల్లో వనాల పెంపకం (అగ్రో-ఫారెస్ట్రీ) వంటి కార్యకలాపాలను చేపట్టవచ్చన్నారు. ఈ కార్యకలాపాలను ఒకే సారి అనుసరిస్తూ, ఏడాది పొడవునా నిలకడ కలిగిన, మెరుగైన ఆదాయాన్ని సంపాదించగలుగుతారని ఆయన అన్నారు.

రైతులకు ఉత్పాదన తాలూకు గిట్టుబాటు ధరలను ఇప్పించడానికి గోధుమ, ధాన్యం, నూనెగింజలు సహా ప్రధాన పంటల కనీస మద్దతు ధరను (ఎమ్ఎస్‌పీ) పెంచామనీ, ప్రస్తుత సీజన్లో ఎమ్ఎస్‌పీ పై పంటలను చరిత్రాత్మక స్థాయిలో సేకరిస్తున్నామనీ మంత్రి తెలిపారు. కందులు, ఎర్ర కందిపప్పు, మినపప్పు వంటి పప్పుధాన్యాల పంటలకు రైతులు నమోదు పూర్తి చేసుకొని ఎంత పంటను విక్రయించడానికి తీసుకు వచ్చినప్పటికీ, ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందనీ, దీంతో పప్పులను పండించే రైతులకు చెప్పుకోదగిన సహాయం లభించిందనీ మంత్రి వివరించారు.ఇదివరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో రైతులు పరిహారాన్ని అందుకోవడానికి నెలల తరబడి ఎదురుచూడాల్సివచ్చేదని కేంద్ర వ్యవసాయ మంత్రి అన్నారు. ఏమైనా, ప్రభుత్వం నియమావళిలో సమగ్ర సవరణలను ప్రవేశపెట్టి, ఒక్క రైతు పంటకైనా సరే నష్టం వస్తే బీమా కంపెనీ ఆ నష్టానికి తప్పనిసరిగా పరిహారాన్ని ఇచ్చేలా చూసిందన్నారు. దిగుబడికి సంబంధించిన సమాచారం అందాక, 21 రోజుల లోపలే రైతు ఖాతాలో బీమా క్లెయిము సొమ్ము జమ కాలేదంటే, అలాంటప్పుడు బీమా కంపెనీలూ, రాష్ట్ర ప్రభుత్వాలూ .. ఈ రెండు పక్షాలూ కూడా.. 12 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఆలస్యం కారణంగా నష్టపోయే అగత్యం రైతులకు ఉండదనీ, వారు ఇటు పంటా నష్టపోయి అటు పరిహారమూ జాప్యమయ్యి.. ఇలా రెండు రకాల దెబ్బల్ని సహించనక్కర్లేకుండా పోతుందనీ మంత్రి అన్నారు. "నేను లంచాలు తీసుకోను, మరెవ్వరినీ తీసుకోనివ్వను" అన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగానే, పంట బీమాలోగాని ఇతర పథకాల్లో గాని ఏవైనా అవకతవకలుంటే సహించబోమని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు.

# దేశీయ బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు వాటాదారులతో బొగ్గు మంత్రిత్వ శాఖ సమావేశం

న్యూఢిల్లీ, మార్చి 18:భారత ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడం, వేగంగా కొత్త గనులను అభివృద్ధి చేయడం, వాటిని కార్యాచరణలోకి తీసుకురావడం వంటి వ్యూహాలపై చర్చించడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ నేడు కీలక సమావేశం నిర్వహించింది. "విధాన సంస్కరణల దృష్ట్యా దేశీయ బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయడం" అనే అంశంపై జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బొగ్గు రంగానికి చెందిన కీలక భాగస్వాములు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ స్పష్టతతో, లక్ష్యంతో చర్చలను నిర్వహిస్తూ వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించారు. ఇది రాబోయే ఏళ్లలో బొగ్గు ఉత్పత్తిలో మంత్రిత్వ శాఖ సంస్కరణాధారిత, భాగస్వాముల కేంద్రీకృత విధానాన్ని ప్రతిబింబించింది. ఈ చర్చల్లో బొగ్గు మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, ప్రైవేటు రంగ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, బొగ్గు వ్యవస్థకు చెందిన ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను సాధించడానికి భారత్ కేవలం చిన్న మార్పులకే పరిమితం కాకుండా భారీ సంస్కరణల దిశగా వెళ్లాలని పేర్కొన్నారు. "సంస్కరణ, పనితీరు, పరివర్తన, సమాచారం'' మార్గదర్శక మంత్రాన్ని ప్రస్తావిస్తూ.. శాస్త్రీయ పద్ధతిలో గనులను మూసివేయడంపై ప్రత్యేక దృష్టి సారించి, అన్వేషణ, వేలం, అనుమతులు, కార్యకలాపాలు, ఫైనాన్సింగ్‌తో సహా మొత్తం బొగ్గు రంగంలో నిరంతర, సమగ్ర సంస్కరణల అవసరం ఉందని తెలిపారు. ఉత్పత్తిని పెంచడానికి, సరఫరా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, గనుల అభివృద్ధి నుంచి మూసివేత వరకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పనులు సాగేలా చూడటానికి, అడ్డంకులను క్రమపద్ధతిలో తొలగించాలని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

వాటాదారులతో క్రమం తప్పకుండా జరిపే సంప్రదింపులు.. అభిప్రాయాలు, సూచనలను స్వీకరించడానికి కీలకమని కేంద్రమంత్రి తెలిపారు. భాగస్వాములతో బాధ్యతాయుతంగా, అందరినీ కలుపుకొని ముందుకు సాగడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో పుష్కలంగా ఉన్న బొగ్గు నిల్వలను ఉపయోగించుకుంటూ బొగ్గు గ్యాసిఫికేషన్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది రాబోయే ఏళ్లలో బొగ్గు ఉత్పత్తిలో ప్రైవేటు రంగ భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇంధన భద్రత పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ. సమన్వయ ప్రయత్నాలు, నిరంతర విధానపరమైన మద్దతు ద్వారా బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ.. దేశం 'వికసిత్ భారత్ 2047' దార్శనికత వైపు పయనిస్తున్న తరుణంలో నిరంతర విధానపరమైన సంస్కరణలు బొగ్గు రంగాన్ని మరింత పారదర్శకమైన, పోటీ తత్వంతో కూడిన, సమర్థవంతమైన వ్యవస్థగా మార్చాయని తెలిపారు. ఈ సంస్కరణలు వ్యాపార సౌలభ్యాన్ని బలోపేతం చేశాయని, నియంత్రణ స్పష్టతను పెంచాయని, మొత్తం బొగ్గు రంగంలో వేగవంతమైన వృద్ధికి, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరిచాయని పేర్కొన్నారు.

వాణిజ్య బొగ్గు తవ్వకం, సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థ, డిజిటల్ సంస్కరణలు వంటి చారిత్రాత్మక కార్యక్రమాలు జాతీయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాయని ఆయన చెప్పారు. ఈ చర్యలు సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేశాయని, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాయని, గనుల కార్యకలాపాలను వేగవంతం చేశాయని, వనరులను వెలికితీతను సులభతరం చేశాయని అన్నారు. ఈ ప్రయత్నాలు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, పరిశ్రమల సహకారాన్ని పెంపొందించడానికి, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి దోహదపడుతున్నాయని అన్నారు.

'విధాన సంస్కరణలు, దేశీయ బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయడం' అనే అంశంపై బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి రూపిందర్ బ్రార్ వివరణాత్మక ప్రదర్శన ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో క్యాప్టివ్, వాణిజ్య గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి మొదటిసారిగా 200 మిలియన్ టన్నులను దాటిందని శ్రీమతి బ్రార్ పేర్కొన్నారు. 2021 నుంచి 2025 వరకు క్యాప్టివ్, వాణిజ్య గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి దాదాపు 30 శాతం వార్షిక వృద్ధి రేటుతో పెరిగిందని ఆమె వివరించారు.

గనుల కార్యకలాపాలను త్వరగా కార్యాచరణలోకి తీసుకురావడం కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ చేపట్టిన విధానపరమైన సంస్కరణల గురించి ఆమె భాగస్వాములకు వివరించారు. అన్వేషణ, జీఆర్ తయారీని సులభతరం చేయడం, గనుల తవ్వకాల ప్రణాళిక ఆమోదాన్ని వేగవంతం చేయడం, పర్యావరణ, అటవీ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, గనుల ప్రారంభ అనుమతుల కోసం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి సంస్కరణ గురించి వివరణాత్మక గణాంకాలను అందించారు. బొగ్గు వనరుల స్థిరమైన, సమర్థవంతమైన వినియోగాన్ని నిర్ధారించే ఉద్దేశంతో.. ప్రోత్సాహకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారిస్తూ భూగర్భ బొగ్గు తవ్వకాలను ప్రోత్సహించే చర్యలను కూడా వివరించారు.

అనంతరం జరిగిన ముఖాముఖి చర్చల్లో భాగస్వాములు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అభివృద్ధి చెందుతున్న విధానపరమైన నిబంధనలు, నిర్వహణ సవాళ్లు, బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేసే అవకాశాల గురించి విధానకర్తలు, పరిశ్రమ ప్రతినిధులు, నిపుణుల మధ్య నిర్మాణాత్మక చర్చకు ఈ సంప్రదింపులు ఒక వేదికగా నిలిచాయి. ప్రభుత్వం, పరిశ్రమల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, గనుల తవ్వక పద్ధతుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడం, దేశ బొగ్గు రంగంలో దీర్ఘకాలిక వృద్ధి, స్థిరత్వానికి మద్దతుగా విధాన సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై సమష్టి అభిప్రాయంతో ఈ చర్చలు ముగిశాయి.

దేశీయ బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఇంధన రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను బలోపేతం చేయడం వంటి ఉమ్మడి లక్ష్యం దిశగా భాగస్వాములు తమ అభిప్రాయాలను పంచుకోవడానికి, తమ ప్రయత్నాలను సమన్వయం చేసుకోవడానికి ఈ సమావేశం ఒక గొప్ప వేదికగా మారింది. స్థిరమైన, బాధ్యతాయుతమైన గనుల తవ్వక పద్ధతులను అనుసరిస్తూనే దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చగల ఆధునిక, సమర్థవంతమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న బొగ్గు రంగాన్ని నిర్మించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ చర్చలు తెలియజేశాయి.

# పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన

నల్గొండ, 18: గట్టుప్పల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆద్వర్యంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. మునుగోడు ఏడిఏ వేణుగోపాల్, హార్టికల్చర్ అధికారి విద్యాసాగర్ హాజరై ఆయిల్ పామ్ పంట గురించి, దాని సాగు విధానం, అనువైన నేలలు, మార్కెటింగ్ గురించి వివరించారు. పంట మార్పిడి విధానం, దాని వల్ల కలిగే లాభాలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎం.రేవతి, జి.రాకేశ్, కార్తీక్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలి : డీఎల్పీవో సతీష్ కుమార్

ఆదిలాబాద్, మార్చి 18: శిక్షణ పొందిన వార్డు సభ్యులు శిక్షణను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధి దిశగా సమర్థంగా పనిచేయాలనీ బెల్లంపల్లి డీఎల్పీవో డీ సతీష్ కుమార్ సూచించారు. మండలంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కోసం కొత్తపల్లి రైతు వేదికలో 5 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని, గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరించాలని కోరారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థులకు సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్స్, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్



ఖమ్మం, మార్చి 18:టేకులపల్లి మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్ రావు, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలునాయక్ ఇచ్చిన ఇఫ్తారు విందులో బుధవారం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య దళ్ సింగ్ నాయక్, మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వర ప్రసాద్, సర్పంచులు బోడ బాలునాయక్, లకవత్ నాకా నాయక్, లక్ష్మనాయక్, రామా నాయక్, టేకులపల్లి ఉప సర్పంచ్ అనంతుల వసంత, బీఆర్ఎస్ నాయకులు బానోతు రామా నాయక్, జాలాది అప్పారావు, భూక్యా లాలు నాయక్, ఆమెడ రేణుక, భూక్యా బాలాజీ, మౌలానా, నాగభూషణం, జాటోత్ నరేశ్, మూడు హుస్సేన్ పాల్గొన్నారు.

# 24 గంటలు, 48 గంటల్లో కచ్చితంగా డెలివరీ చేసేలా మూడు కొత్త పోస్టల్ సేవలు ప్రారంభించిన తపాలా శాఖ

## – హైదరాబాద్ సహా ఆరు మెట్రో నగరాల్లో అందుబాటులోకి కొత్త సేవలు




హైదరాబాద్, మార్చి 18:హైదరాబాద్ సహా ఆరు మెట్రో నగరాల్లో మూడు కొత్త పోస్టల్ సేవలను తపాలా శాఖ మంగళవారం ప్రారంభించింది. 24 గంటలు, 48 గంటల్లో కచ్చితంగా డెలివరీ అందించేలా రూపొందించిన 24 స్పీడ్ పోస్ట్, 24 స్పీడ్ పోస్ట్ పార్సిల్, 48 స్పీడ్ పోస్ట్ సేవలను ఢిల్లీలో కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని కింగ్ కోఠిలో గల భారతీయ విద్యాభవన్స్ కళాశాల ఆడిటోరియంలో సైతం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వీణా కుమారి డెర్మల్ మాట్లాడుతూ.. ఈ కొత్త సేవలను అందుబాటులోకి తీసుకురావడం పోస్టల్ సేవల చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. రిటైల్, బిజినెస్ వినియోగదారుల మారుతున్న అవసరాలను తీర్చడానికి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఇండియా పోస్ట్ కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ కొత్త సేవలు ఇప్పుడు హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. హైదరాబాద్‌లో 38 బుకింగ్ కార్యాలయాలు, 94 డెలివరీ కార్యాలయాలు '24 స్పీడ్ పోస్ట్', '24 స్పీడ్ పోస్ట్ పార్శిల్' సేవలను నిర్వహిస్తాయని, అలాగే '48 స్పీడ్ పోస్ట్' సేవలను 176 బుకింగ్ కార్యాలయాలు, 94 డెలివరీ కార్యాలయాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఈ సేవల కింద వచ్చే అన్ని కన్సైన్‌మెంట్‌లను ప్రాధాన్యతగా పరిగణిస్తామని తెలిపారు.

'24 స్పీడ్ పోస్ట్' సేవలు ప్రత్యేకంగా డాక్యుమెంట్ల డెలివరీ కోసం రూపొందించారు. బుక్ చేసిన మరుసటి రోజు కల్లా డాక్యుమెంట్ల డెలివరీ పూర్తవుతుంది. '24 స్పీడ్ పోస్ట్ పార్శిల్' సర్వీసు 5 కేజీల వరకు ఉండే పార్శిళ్ల కోసం అందుబాటులోకి తెచ్చారు. ఇవి కూడా మరుసటి రోజు కల్లా డెలివరీ అవుతాయి. '48 స్పీడ్ పోస్ట్' సర్వీసు ద్వారా 48 గంటలలోపు డాక్యుమెంట్ల డెలివరీ జరుగుతుంది. డెలివరీలో ఆలస్యమైతే కొన్ని షరతులకు లోబడి నగదు వాపసు సౌకర్యాన్ని సైతం తపాలా శాఖ అందిస్తుంది.

ప్రత్యేక ప్యాకేజింగ్, ఎస్ఎంఎస్ అలర్ట్‌లతో కూడిన ఎండ్-టు-ఎండ్ ట్రాకింగ్, వ్యాపార వినియోగదారుల కోసం 'ముందు బుక్ చేసి తర్వాత చెల్లించే' సౌకర్యం, ఉచిత పికప్ సేవలు, ఓటీపీ ఆధారిత సురక్షిత డెలివరీ, ఏపీఐ ఇంటిగ్రేషన్ వంటివి అదనపు ఫీచర్లు కూడా ఈ మూడు సేవల్లో ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎం.ఎన్. సుమితా అయోధ్య, హెడ్‌క్వార్టర్స్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీమతి ఎన్.ఆర్. విశాలాక్షి, తెలంగాణ సర్కిల్ పోస్టల్ అకౌంట్స్ డైరెక్టర్ శ్రీ సంపర్, హెడ్‌క్వార్టర్స్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీమతి రిప్పన్ దుల్లెట్, హెచ్.ఆర్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీ వై. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ




ఖమ్మం, మార్చి 18: పాల్వంచ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో ఈ నెల 19 నుండి 21వ తేదీ వరకు కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర - 2026, ఉగాది వేడుకలకు సంబంధించి బ్రోచర్లు బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ సంగీత విభావరి ఉండనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుండి కవులు, కళాకారులు ఉత్సవాలకు హాజరు అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్, అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్, గౌరవ సలహాదారులు కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు, డాక్టర్ బుచ్చయ్య, లింగమూర్తి, శీరంశెట్టి కాంతారావు, సాంబశివరావు, చలువాది ప్రకాష్, సంపత్ కుమార్, అప్పలాచార్యులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

# 'కృషి విజ్ఞాన కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

## – వ్యవసాయ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి

ఖమ్మం, మార్చి 18: కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రైతు సదస్సు- కిసాన్ మేళా అనే కార్యక్రమాన్ని బుధవారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేవీకే అందిస్తున్న సేవలను సద్వినియోగం పరుచుకుని రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవాలని తద్వారా అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. అలాగే రైతులు మట్టి పరీక్ష చేయించుకుని ప్రధాన గుణంగా ఎరువులు వాడాలని చెప్పారు.

అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. మన ప్రాంతానికి అనుకూలంగా ఎ ౦ ట ల న ు పండించుకోవాలన్నారు. రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న చీడపీడల సమస్యల యాజమన్య పద్ధతుల గురించి వివరించారు. త్రీ ఇంక్లైన్ గ్రామ సర్పంచ్ ప్రవళిక మాట్లాడుతూ.. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ.. రైతులకు శాస్త్రవేత్తల సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి వెటర్నరీ అధికారి, ఫిషరీ అధికారి ఆ శాఖ అందిస్తున్న పథకాలను రైతులకు వివరించారు. కొత్తగూడెం టాక్స్ చైర్మన్ మండే హనుమంతరావు అభ్యుదయ రైతులు, వారి అభిప్రాయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ నాగాంజలి, శిరీష, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శరత్‌చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ పాల్గొన్నారు.

# చెస్ పోటీల బ్రోచర్లు ఆవిష్కరించిన హనుమకొండ ఏసీపీ నరసింహారావు

హనుమకొండ చౌరస్తా, మార్చి 18: ఈనెల 22న జరగబోయే ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీల బ్రోచర్లను హనుమకొండ ఏసీపీ పి.నరసింహారావు ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా చదరంగ సమైక్య ఆధ్వర్యంలో హనుమకొండ లోని పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో ఈనెల 22న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 4వ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు.

ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2016 న జన్మించిన వారు అర్హులని, ఇందులో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు, అందజేయబడుతుందని, ఇతర వివరాలకు 90595 22986 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్త సేకరణపై విద్యార్థులకు అవగాహన

ఖమ్మం, మార్చి 18:బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా పాల్వంచ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణ, వర్మికంపోస్ట్ తయారీ తదితర అంశాలపై సర్పంచ్ గుండి బాబూరావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు బుధవారం అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి అడిషనల్ డీఆర్డీఓ రవి, ఎంపీడీఓ జమలారెడ్డి హాజరయ్యారు. పంచాయతీ కార్యాలయం నుండి డంపింగ్ షెడ్ వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి అక్కడ వర్మి కంపోస్ట్ తయారీ, తడి, పొడి చెత్త వేరు చేయడంపై ఎస్పీఎం రేవతి అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు దుర్గ, లక్ష్మి, బత్తుల శిరీష, కరం సామ్రాజ్యం, కార్యదర్శి స్పందన, ఏపీఓ, ఈసీ, టీఏ, ఎఫ్ఎలతో పాటు కళాశాల అధ్యాపకులు, గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

# సారపాకకు చేరుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

ఖమ్మం, మార్చి 18: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఐటీడీఏ డీడీ అశోక్, ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీలత, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ఉపేందర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్, భద్రాచలం ఏఎస్‌డబ్ల్యూ హనుమంతరావు, పాల్వంచ ఏఎన్‌ఐడబ్ల్యూఓ, హెచ్‌డబ్ల్యూఓ అక్షయ్, సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పోరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
కిన్నెర కల్చరల్ & ఎడ్యుకేషనల్ ట్రస్ట్
శుక్రవారం 20, మార్చి 2026, సా॥ 5:30 గంటలకు
రవీంద్రభారతి, హైదరాబాద్
కిన్నెర-శ్రీ పరాభవ నామ ఉగాది పురస్కారాలు
ముఖ్యఅతిథి : జస్టిస్ నూతలపాటి వెంకట రమణ
పూర్వ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ
అధ్యక్షులు : డా॥ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్. (రి.),
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
గౌరవ అతిథి : శ్రీ భోగరాజు మూర్తి, మేనేజింగ్ డైరెక్టర్, 'శ్రీ' డెవలపర్స్
సా॥ 5:30 నుండి 6-45 గంటల వరకు :
కళారత్న డా॥ ద్వారం లక్ష్మి గారిచే శాస్త్రీయ సంగీత కచేరి
వయోలిన్ : శ్రీ ఆర్. దినకర్ మృదంగం : శ్రీ సిహెచ్. రామకృష్ణ
డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి
సెల్ : 98660 57777

# మల్లు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయం : అక్కెనపల్లి మీనయ్య




నల్గొండ, 18:తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని, మానవత విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య అన్నారు. మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండలోని సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సూర్యాపేట జిల్లాకు చెందిన నిరుపేద జుట్టుకొండ వీరయ్యకు ఉచిత మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం జీవితమంతా త్యాగాలమయం అన్నారు. జీవితాంతం నిరుపేదల అభ్యున్నతి కోసం పరితపించినట్లు తెలిపారు. ఆమె చరిత్రను మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించేందుకు ఆమె పేరుతో నిర్వహించే సేవా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతీ యేటా వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మోకాలు మార్పిడి ఆపరేషన్ ను అర్హులు సద్వినియోగించుకోవాలని కోరారు.

మల్లు స్వరాజ్యం మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు మల్లు అరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం తన జీవితాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాల కోసం ధారపోసిన వీర వనిత అన్నారు. మహిళా హక్కులు, ప్రజల హక్కులు, పేదల భూముల కోసం చివరి వరకు పోరాడరన్నారు. ఆమె స్ఫూర్తితో ప్రతీ యేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్న సత్యవతి హాస్పిటల్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సత్యవతి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రామనోహర్ మాట్లాడుతూ.. స్వరాజ్యం స్ఫూర్తిగా ఎన్నో కార్యక్రమాలు ప్రతీ సంవత్సరం చేయడం చాలా సంతోషకరమన్నారు. అందులో తమ హాస్పిటల్ భాగస్వామ్యం కావడం ఇంకా సంతోషంగా ఉందన్నారు. అదే స్ఫూర్తితో తాము కూడా ఉచిత మెడికల్ క్యాంప్‌లు, నిరుపేదలకు ఉచిత సర్వీస్ అందిస్తున్నట్లు తెలిపారు.

ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెల మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత వైద్య సేవలే కాకుండా విద్యార్థులకు కరాటే, ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు టైలరింగ్, క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తమ సంస్థ చేస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సామాజిక సేవకు కృషి చేస్తున్న ఎంజీయూ తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత, చర్లపల్లి రెసిడెన్షియల్ కాలేజీ ఎకనామిక్స్ లెక్చరర్ షేక్ సుల్తానాను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యవతి వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్యాకల్టీ శంకర్ పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వాక్సినేషన్ కార్యక్రమంపై అప్‌డేట్

న్యూఢిల్లీ, మార్చి 18:దేశవ్యాప్తంగా ఉచిత హెచ్‌పీవీ వాక్సినేషన్ కార్యక్రమం 28 ఫిబ్రవరి 2026న ప్రారంభమైంది. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 14 ఏళ్ల వయసున్న సుమారు 1.2 కోట్ల మంది బాలికలే ఈ కార్యక్రమ లక్ష్యం. దీని ద్వారా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలన్నింటిలోనూ గార్డసిల్-4 వాక్సిన్ ఒక డోసును ఉచితంగా అందిస్తారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు-ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు), సబ్-డివిజనల్ ఆస్పత్రులు (ఎస్‌డీహెచ్‌లు), జిల్లా ఆస్పత్రులు (డీహెచ్‌లు), ప్రభుత్వ వైద్య కళాశాలలు (జీఎంసీలు) సహా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లోనూ ఈ టీకా అందుబాటులో ఉంటుంది. మూడు నెలల ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమం తర్వాత కూడా సాధారణ టీకాల పంపిణీ సమయంలో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుంది.

ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ వైద్యాధికారుల సమక్షంలో జరుగుతుంది. దుష్ప్రభావాలు తలెత్తితే, వాటిని నివారించేందుకు 24లీ7 అందుబాటులో ఉండే ఏఈఎఫ్ఐ మేనేజ్‌మెంట్ సెంటర్లతో టీకా కేంద్రాలను అనుసంధానించారు. హెచ్‌పీవీ వాక్సిన్ వేయించుకోవటం పూర్తిగా స్వచ్ఛంద నిర్ణయం. టీకా వేయటానికి ముందు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. హెచ్‌పీవీ వాక్సిన్ అమలు కార్యాచరణ మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, యూటీలకు తెలియజేశారు.

గర్భాశయ క్యాన్సర్‌కు వ్యూహాత్మక నివారణ చర్యలను భారత ప్రభుత్వం అమలు చేస్తోంది. మహిళల్లో ఈ వ్యాధి ప్రభావాన్ని తగ్గించటమే లక్ష్యంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ముందుస్తుగా వ్యాధిని గుర్తించటం, సరైన సమయంలో చికిత్స వంటి అంశాలతో బహుముఖ విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోంది. ఈ కార్యక్రమాలతో పాటు అంతర్జాతీయ శాస్త్రీయ ఆధారాల ప్రకారం.. భారతదేశంలో గర్భాశయ క్యాన్సర్ కేసులను తగ్గించటంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కీలక పాత్ర పోషిస్తుంది.

అనుమతి పొందిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ల సమర్థతకు సంబంధించిన పూర్తి వివరాలు ఉత్పత్తి లక్షణాల సారాంశం (ఎస్ఎంపీసీ)లో ప్రచురితమయ్యాయి. ఇవి సీడీఎస్‌సీఓ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

ఈ సమాచారాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయమంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్ ఇవాళ రాజ్యసభలో లిఖితపూర్వకంగా అందించారు.

# పన్ను పీకిన తర్వాత మహిళ మృతి.. డెంటల్ డాక్టర్ పరార్




రాంచీ, మార్చి 18:ఒక డెంటల్ క్లీనిక్‌లో మహిళ పన్ను పీకించుకున్నది. ఆ తర్వాత అనుమానాస్పద పరిస్థితుల్లో ఆమె మరణించింది. ఈ నేపథ్యంలో డెంటల్ డాక్టర్ పరారయ్యాడు. ఆ మహిళ కుటుంబం ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జార్ఖండ్‌లోని పలాము జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హరిహర్‌గంజ్‌లోని ఒక ప్రైవేట్ డెంటల్ క్లినిక్‌లో బీహార్‌కు చెందిన విజయంతి దేవి పంటికి చికిత్స పొందింది. డెంటల్ క్లీనిక్ నిర్వహించే డాక్టర్ అష్రఫ్ అలీ ఆమె పన్ను పీకే సర్జరీ చేశాడు.

కాగా, పన్ను పీకిన తర్వాత విజయంతి దేవి తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ మహిళ చికిత్స పొందుతూ మరణించింది. ఇది తెలుసుకున్న డెంటల్ డాక్టర్ అష్రఫ్ అలీ పారిపోయాడు. మరోవైపు విజయంతి దేవి మరణంపై ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డెంటల్ డాక్టర్ నిర్లక్ష్యం కారణమని ఆరోపించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన డెంటల్ క్లీనిక్ నిర్వాహకుడి కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. స్థానిక అధికారులు కూడా ఈ సంఘటనపై స్పందించారు. ఆ ప్రైవేట్ డెంటల్ క్లీనిక్‌కు సీల్ వేశారు.

# డిజిటల్ యుగంలో నిజనిర్ధారణకు దిక్సూచిగా మారిన ఏఐ



హైదరాబాద్, మార్చి 18:సంగారెడ్డి జిల్లాలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ విభాగం ఈ రోజు 'వార్తాలాప్' వర్క్‌షాపును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లింగ వివక్ష సమస్యలు, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాత్రికేయంలో కృత్రిమ మేధ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ముఖ్య అతిథి, విశిష్ట అతిథులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపులో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు130 మంది పాత్రికేయులు పాల్గొన్నారు.

వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కచ్చితమైన, అధికారిక సమాచారాన్ని ప్రసారం చేయడంలో పీఐబీ పోషిస్తున్న పాత్ర గురించి పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) శ్రీమతి శ్రుతి పాటిల్ వివరించారు. కృత్రిమ మేధ వినియోగం బాగా పెరిగిన ఈ రోజుల్లో వార్తల్లోని నిజానిజాల నిర్ధారణలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం కీలకంగా వ్యవహరిస్తోందని ఆమె తెలిపారు.

''తప్పుడు వార్తలను గుర్తించి సరైన సమాచారాన్ని నిష్పక్షపాతంగా ప్రసారం చేయడానికి ఆధునిక సాధనాలు, ఏఐను ఎలా వినియోగించుకోవాలో వార్తాలాప్ శిక్షణ ఇస్తుంది. విలేకరుల రిపోర్టింగ్ ప్రమాణాలను ఈ కార్యక్రమం మెరుగుపరుస్తుంది" అని ఆమె అన్నారు.

డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం గురించి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య వివరించారు. ఏఐ ఉపయోగించి తయారు చేసిన కంటెంట్, తప్పుదోవ పట్టించే విజువల్స్, అసత్య సమాచారం తీవ్రమైన సమస్యలుగా పరిణమిస్తున్నాయని తెలిపారు.

''ఒక చిన్న తప్పుడు సమాచారం కూడా సమాజంపై, ఆర్థిక వ్యవస్థపై, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. వార్తాలాప్ తరహా శిక్షణ కార్యక్రమాలు జర్నలిస్టుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తాయి" అని అన్నారు.

లింగ సమానత్వం, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల వివరించారు. లింగ సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని, ఈ తరహా ఆలోచనాధోరణిని పెంపొందించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇలాంటి సమస్యలపై వార్తల ద్వారా అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని ఆమె వివరించారు.

నోట్‌బుక్ ఎల్ఎల్ఎం, చాట్‌జీపీటీ, గూగుల్ పిన్ పాయింట్, ఎలెవన్ ల్యాబ్స్, జెమినీ ఏఐతో సహా జర్నలిజంలో ఏఐ సాధనాల వినియోగం గురించి శ్రీమతి సత్య ప్రియ వివరించారు.

# సైబర్ నేరాల నిరోధానికి సమన్వయ వ్యవస్థ- ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్

న్యూఢిల్లీ, మార్చి 18:భారత రాజ్యాంగం ఏడవ షెడ్యూల్ ప్రకారం 'పోలీసు', 'శాంతి భద్రతలు' రాష్ట్ర పరిధిలోని అంశాలు. సైబర్ నేరాలతో సహా అన్ని రకాల నేరాల నివారణ, గుర్తింపు, విచారణ, నేరస్తులను శిక్షించడం వంటి పనుల్లో ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలోని చట్టాల అమలు సంస్థలదే ప్రధాన బాధ్యత. ఈ సంస్థల సామర్థ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా సలహాలు, ఆర్థిక సాయం అందిస్తూ రాష్ట్రాల ప్రయత్నాలకు మద్దతు ఇస్తోంది.

దేశంలో సైబర్ నేరాల నివారణ, గుర్తింపు, విచారణ, నేరస్తులను శిక్షించడం కోసం ఒక వ్యవస్థను రూపొందించే లక్ష్యంతో 2018లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ)ను ఒక పథకంగా ఏర్పాటు చేసింది. అతి తక్కువ కాలంలోనే, సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో దేశ సామర్థ్యాన్ని పెంచడానికి, చట్ట అమలు సంస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని పెంపొందించడానికి ఐ4సీ కృషి చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుబంధ కార్యాలయంగా 1 జూలై 2024 నుంచి ఐ4సీ పని చేస్తోంది. పౌరులకు ఎదురయ్యే సైబర్ నేరాల సమస్యల పరిష్కారంపై ఇది దృష్టి సారించింది. ఇందులో భాగంగా వివిధ చట్ట అమలు సంస్థలు, భాగస్వాముల మధ్య సమన్వయం, సామర్థ్యం పెంచడం, అవగాహన కల్పించడం వంటి కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

ఆర్థిక మోసాలను వెంటనే నివేదించడానికి, మోసగాళ్లు డబ్బును దారి మళ్లించకుండా ఆపడానికి ఐ4సీ పరిధిలో 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్)ను 2021లో ప్రారంభించారు. ఐ4సీ నిర్వహిస్తున్న ఈ వ్యవస్థ ప్రకారం, 31.01.2026 నాటికి 24.65 లక్షల పైగా ఫిర్యాదులలో రూ. 8,690 కోట్ల పైగా డబ్బును దారిమళ్లకుండా కాపాడారు. ఆన్‌లైన్ సైబర్ నేరాలపై ఫిర్యాదులు చేయడానికి టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1930' అందుబాటులోకి వచ్చింది. పోలీసు వర్గాలు అందించిన సమాచారం ప్రకారం, 31.01.2026 నాటికి భారత ప్రభుత్వం 12.94 లక్షల పైగా సిమ్ కార్డులను, 3.03 లక్షల ఐఎంఈఐ నంబర్లను నిలిపివేసింది.

సైబర్ నేరగాళ్ల వివరాలను నమోదు చేసే 'సస్పెక్ట్ రిజిస్ట్రీ'ని బ్యాంకులు, ఆర్థిక సంస్థల సహకారంతో 10.09.2024న ఐ4సీ ప్రారంభించింది. 31.01.2026 నాటికి, బ్యాంకుల నుంచి అందిన 23.05 లక్షల పైగా అనుమానిత డేటా, 27.37 లక్షల 'లేయర్ 1' మ్యూల్ ఖాతాల వివరాలను ఈ రిజిస్ట్రీలోని సంస్థలతో పంచుకున్నారు. దీని ద్వారా రూ. 9,518 కోట్ల పైగా విలువైన మోసపూరిత లావాదేవీలను నిలిపివేశారు.

సైబర్ నేరాల సమాచారాన్ని పంచడం, విశ్లేషించడం కోసం చట్ట అమలు సంస్థలకు ఒక మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) వేదికగానూ, డేటాను భద్రపరిచే సమన్వయ వేదికగానూ సేవలందించడానికి 'సమన్వయ వేదిక' అందుబాటులోకి వచ్చింది. వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన సైబర్ నేరాల ఫిర్యాదుల ఆధారంగా నేరాలు, నేరస్తుల మధ్య ఉన్న అంతర్రాష్ట్ర సంబంధాల విశ్లేషణను ఇది అందిస్తుంది. 'ప్రతిబింబ్' మాడ్యూల్ నేరస్తుల స్థానాలను, నేరాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను మ్యాప్‌పై చూపిస్తూ సంబంధిత అధికారులకు స్పష్టతనిస్తుంది. ఈ మాడ్యూల్ ద్వారా చట్ట అమలు సంస్థలు ఐ4సీ, ఇతర ఎస్ఎంఈల నుంచి సాంకేతిక-చట్టపరమైన సాయాన్ని సులభంగా పొందవచ్చు. దీని ఫలితంగా ఇప్పటివరకు 21,85 7మందికి పైగా నిందితులను అరెస్టు చేశారు. 1,49,636 పైగా సైబర్ విచారణ సహాయ అభ్యర్థనలు నమోదయ్యాయి. సైబర్ మోసాల కేసుల్లో ఈ-ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రయత్నం చేపట్టింది. సైబర్ నేరాల కేసుల్లో ఎఫ్ఐఆర్ దాఖలు చేసే ఈ 'ఈ-ఎఫ్ఐఆర్' విధానం ఢిల్లీ, రాజస్థాన్, చండీగఢ్, మధ్యప్రదేశ్, గోవా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అమలులోకి వచ్చింది.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ఈ రోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాలను వెల్లడించారు.

# కీలక రంగాల్లో దేశ సాంకేతిక అగ్రగణ్యతకు సి-డాక్ కీలకం: ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్

న్యూఢిల్లీ, మార్చి 18:అధునాతన కంప్యూటింగ్ అభివృద్ధి కేంద్రం (సి-డాక్) 39వ వ్యవస్థాపక దినోత్సవాన్నుద్దేశించి.. ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతా శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ వర్చువల్‌గా ప్రసంగించారు. అత్యున్నత స్థాయి కంప్యూటింగ్, సైబర్ భద్రత, సెమీకండక్టర్ సాంకేతికతలు, ఇతర అధునాతన డిజిటల్ రంగాల్లో దేశ సమర్థతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందంటూ సి-డాక్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్, జాతీయ సెమీకండక్టర్ మిషన్, జాతీయ క్వాంటం మిషన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో సి-డాక్ సేవలను వివరిస్తూ... అత్యాధునిక పరిశోధన, మౌలిక సదుపాయాల ద్వారా ఎన్నో ఏళ్లుగా ఈ సంస్థ దేశ వైజ్ఞానిక, డిజిటల్ వ్యవస్థను బలోపేతం చేస్తోందని శ్రీ ఎస్. కృష్ణన్ అన్నారు. ఆపరేటింగ్ సిస్టంలు, డేటా బేస్‌ల వంటి మౌలిక సాంకేతికతల్లో స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చిన ఆయన... క్వాంటం కంప్యూటింగ్, ఆర్ఐఎస్‌సీ-వి, బ్లాక్ చెయిన్, ఐవోటీ వంటి అధునాతన రంగాలపై దృష్టి పెట్టడం అత్యావశ్యకమని స్పష్టం చేశారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, రక్షణ రంగాలతో బలమైన సహకారంతో పాటు.. వాస్తవిక ఫలితాలనిచ్చే అనువర్తిత పరిశోధన ప్రాధాన్యాన్ని శ్రీ కృష్ణన్ ప్రముఖంగా ప్రస్తావించారు. పరిశ్రమలతో సి-డాక్ భాగస్వామ్యాలు విస్తరిస్తుండడం, వ్యూహాత్మక రంగాల్లో భాగస్వామ్యం పెరుగుతుండడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌తో మొదలుపెట్టి అన్ని కేంద్రాల్లోనూ వ్యవస్థాపక దినోత్సవాల నిర్వహణ నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు.

సమావేశాన్నుద్దేశించి ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ మాట్లాడుతూ.. దేశ అంతరిక్ష, డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించడంలో సి-డాక్ అత్యంత కీలక పాత్ర పోషించిందన్నారు. పరమ్ సిరీస్ ద్వారా సూపర్‌కంప్యూటింగ్‌లో సంస్థ బలమైన పరంపరనూ, అలాగే అంతరిక్ష కార్యక్రమాల కోసం కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ వ్యవస్థల అభివృద్ధిలో ఇస్రోతో సి-డాక్ సహకారాన్నీ ఆయన ప్రస్తావించారు.

అంతర్జాతీయంగా ప్రస్తుత పరిణామాలను పేర్కొంటూ... ఉపగ్రహ సమూహాల వేగవంతమైన విస్తరణ, ఏఐ ఆధారిత స్వయం ప్రతిపత్త వ్యవస్థల వినియోగం పెరుగుతుండడం, అభివృద్ధి చెందుతున్న రంగాలతో అంతరిక్ష సాంకేతికతల అనుసంధానాన్ని డాక్టర్ సోమ నాథ్ ప్రస్తావించారు. చిన్న ఉపగ్రహ వేదికలు, సరఫరా వ్యవస్థలు, కీలక భాగాలను దేశీయంగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సాంకేతిక స్వావలంబన సాధించడం అత్యావశ్యకమని స్పష్టం చేశారు. జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా తన సూపర్ కంప్యూటింగ్ మిషన్‌ను మార్చుకోవాలని, అధునాతన కంప్యూటింగ్ - అంతరిక్ష సాంకేతికతల్లో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆయన సి-డాక్‌ను కోరారు. సి-డాక్ 39వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సుదీప్ శ్రీవాస్తవ శుభాకాంక్షలు తెలిపారు. అధునాతన సాంకేతికతల్లో భారత్ సామర్థ్యాలను పెంపొందించడంలో సి-డాక్ కీలక పాత్ర పోషిస్తోందంటూ అభినందించారు. ప్రజలే కేంద్రంగా సాంకేతిక అభివృద్ధి విధానాలపై దృష్టి సారించడం అత్యావశ్యకమని ఆయన స్పష్టం చేశారు. పరిశోధన - వాణిజ్యీకరణ మధ్య అంతరాలను తొలగించాలని, అత్యున్నత నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఆవిష్కరణ, పేటెంట్లు, ఉన్నతిని సాధించే దిశగా నిరంతర కృషి అత్యంత ప్రధానమైన అంశాలని ఆయన పేర్కొన్నారు.

ఈ 39వ వ్యవస్థాపక దినోత్సవంలో సి-డాక్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఇ. మాగేశ్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, ఎండీ డాక్టర్ రణ్‌ధీర్ ఠాకూర్, సీఎస్ఐఆర్ - భారత రసాయన సాంకేతిక సంస్థ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి, ఐఐటీ- గాంధీనగర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రజత్ మూనా, రక్షణ పరిశోధన - అభివృద్ధి సంస్థ డీజీ (ఎంఈడీ, సీవోఎస్, సీఎస్) శ్రీమతి శీనా రాణి. ఆర్ పాల్గొన్నారు.

ఆవిష్కరణలను, స్వావలంబనను, వ్యూహాత్మక సహకారాన్ని ప్రోత్సహించడంలోనూ.. తద్వారా కీలక, అధునాతన సాంకేతిక రంగాల్లో భారత్‌ను అంతర్జాతీయంగా అగ్రగామిగా నిలపడంలోనూ సి-డాక్ ప్రాధాన్యాన్ని ప్రముఖులు వివరించారు.

# భారత జెండా కలిగిన ఎల్‌పీజీ వాహక నౌకలు 'శివాలిక్', 'నందా దేవి'కి చెందిన సిబ్బందితో మాట్లాడిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, మార్చి 18:మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులతో కలిసి కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ (ఎంఓపీఎస్‌డబ్ల్యూ) మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్.. భారత జెండా కలిగిన ఎల్‌పీజీ వాహక నౌకలు 'శివాలిక్', 'నందాదేవి'కి చెందిన సాహస సిబ్బందితో ఈ రోజు మాట్లాడారు. కీలకమైన ఎల్‌పీజీ కార్గోను సురక్షితంగా చేరవేయడంలో వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అచంచలమైన కర్తవ్య దీక్షకు ఆయన దేశం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సంభాషణ కార్యక్రమంలో కేంద్ర ఓడరేవులు- నౌకాయాన- జలమార్గాల శాఖ కార్యదర్శి విజయ్ కుమార్, షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సీఐ) ఛైర్మన్ - మేనేజింగ్ డైరెక్టర్ కెప్టెన్ బీ.కె. త్యాగి పాల్గొన్నారు. వీరితో పాటు 'శివాలిక్' నౌక కెప్టెన్ సుఖ్‌మీత్ సింగ్, 'నందాదేవి' నౌక కెప్టెన్ ధీరజ్ కుమార్ అగర్వాల్, రెండు నౌకల సిబ్బంది పాల్గొన్నారు.

నావికులను ఉద్దేశించి మాట్లాడిన శ్రీ శర్బానంద సోనోవాల్.. అత్యంత ప్రమాదకరమైన సముద్ర వాతావరణంలో పనిచేస్తూనే దేశానికి కీలకమైన ఎల్‌పీజీ సరఫరాను సురక్షితంగా చేరవేసిన సిబ్బందికి ఈ కార్యక్రమం..'దేశం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం' వంటిదని పేర్కొన్నారు.

"శివాలిక్, నందాదేవి నౌకల సిబ్బంది ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని గుర్తించడం ఎంతో గర్వకారణం. భారత ఇంధన భద్రతను బలోపేతం చేస్తూ అత్యంత కీలకమైన ఎల్‌పీజీ కార్గో సురక్షిత ప్రయాణాన్ని మీ కృషి సుగమం చేసింది'' అని శ్రీ శర్బానంద సోనోవాల్ వ్యాఖ్యానించారు.

భద్రతాపరమైన ఆందోళనలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో భారత్‌కు ప్రయాణాన్ని కొనసాగించే ముందు రెండు వారాల పాటు ఈ రెండు నౌకలు అత్యంత ముప్పుగల ప్రాంతంలోనే వేచి ఉన్నాయని మంత్రి అన్నారు. అటువంటి సవాలుతో కూడుకున్న పరిస్థితుల్లో కూడా సిబ్బంది అసాధారణమైన సంయమనం, అప్రమత్తత, వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించారని కేంద్ర మంత్రి కొనియాడారు.

పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో సముద్ర రవాణా కార్యకలాపాలను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుండగా.. భారత జెండాలను కలిగిన రెండు ఎల్‌పీజీ వాహక నౌకలు హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటి మార్చి 16, 17 తేదీల్లో దేశానికి చేరుకున్నాయి. సుమారు 92,712 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఉన్న ఎంటీ శివాలిక్, ఎంటీ నందాదేవి నౌకలు.. శుక్రవారం (2026 మార్చి 13) తెల్లవారుజామున హార్ముజ్ జలసంధిని దాటాయి.

"ప్రపంచ వాణిజ్యానికి అజ్ఞాత వీరులు నావికులు. మీ ఇళ్లు, కుటుంబాలకు దూరంగా ఉంటూ అత్యవసర సరకును సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేలా మీరు చూస్తున్నారు" అని శ్రీ సర్బానంద సోనోవాల్ అన్నారు. ప్రపంచ సరఫరా గొలుసును కొనసాగించడంలో సముద్ర సిబ్బంది పోషిస్తున్న కీలక పాత్రను ఆయన ఈ సందర్భంగా ప్రధానంగా చెప్పారు.

పూర్తిగా భారతీయ నావికులతో నడుస్తున్న ఈ రెండు భారత జెండాలు కలిగిన నౌకల విజయవంతమైన ప్రయాణం దేశ సముద్రయాన సిబ్బందికి బలం, పట్టుదలను తెలియజేస్తోందని కేంద్ర మంత్రి అన్నారు.

''ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సముద్రయాన రంగాన్ని బలోపేతం చేయుటం.. మన నావికుల భద్రత, గౌరవం, అంతర్జాతీయ గుర్తింపును నిర్ధారించడానికి కట్టుబడి ఉన్నాం" అని శర్బానంద సోనోవాల్ అన్నారు.

నావికుల అంకితభావం, సేవ వెనుక వారి కుటుంబాల మద్దతు ఒక ముఖ్యమైన అంశమని సోనోవాల్ తెలిపారు.

# ఏడాది పర్వాలకు ఆది పండుగ ఉగాది

ఏడాది పండుగ, ఉగాది పండుగ అనే దేశ్య నామాలతో వ్యవహరింపబడే సంవత్సరాది పర్వము, ఏటా రానున్న ఎన్నతగిన ఏభై పైచిలుకు పండుగలలో మొదటిది. తెలుగువారు తమ సంవత్సరాదిని చాంద్రమాన గణనాధారంగా చైత్ర శుక్ల ప్రతిపదతో ప్రారంభించడం సనాతన ఆచారం. చైత్ర శుక్ల పాడ్యమి సంవత్సరాది అని బ్రహ్మపురాణం కంఠోక్తిగా చెపుతున్నది. అలాగే ఈదినం నుండి సృష్టి ప్రారంభింపబడి, ఆయా దేవతలకు సంబంధిత పనులను బ్రహ్మ అప్పగించినట్లు పురాణ కథనం. శాలివాహన శకానికి మొదటి దినం చైత్ర శుక్లపక్ష పాడ్యమిగా భావించబడు తున్నది. వనవాసానంతరం శ్రీరాముడు సీతా, లక్ష్మణ సహి తంగా అయోధ్యకు ఈనాడే తిరుగు ప్రయాణమై నట్లు పురాణ లిఖితం. వసంత కాలారంభ దినాలలో చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సంవత్సరాది పర్వం జరిపే ఆచారం ఆర్యుల్లో అతి ప్రాచీన కాలం నుండి ఉన్నది. పార్సీలు ఉగాదిని "నౌరోజ్" అంటారు. నౌరోజ్ అనగా కొత్తదినం. ఉగాది పర్వా చరణ విధానాలను నూతన సంవత్సర కీర్తనాద్యా రంభం, ప్రతి గృహ ధ్వజారోహణం, నింబ వ్రతాశనం, సంవత్సరాది శ్రవణం, నవరాత్రి ఆరంభమని ధర్మసింధువు స్పష్టం చేస్తున్నది. ప్రతిగృహ ధ్వజారోహణం, అబ్దాది తైలాభ్యంగం, నవవస్త్రాభరణ ధారణం, ఛత్రచామరాది స్వీకారం, ఉమామహేశ్వర పూజ,



దమనేన బ్రహ్మపూజనం, సర్వాపచ్ఛాంతికర మహాశాంతి, నింబ కుసుమ భక్షణం, పంచాంగ పూజ, శ్రవణం, ప్రపాదాన ప్రారంభం, రాజదర్శనం వాసంత నవరాత్రి ప్రారంభం...పది విధాయక కృత్యాలుగా చెప్పబడినాయి.

## వసంత నవరాత్రుల ప్రారంభం

చైత్ర వైశాఖమాసాలు వసంత రుతువుకాగా, చైత్రమాస తొలిరోజు ఉగాదితో వసంతరుతు ఆరంభం కాగలదు. చైత్రానికి మధుమాసమని, వసంతమాసమని పేరు. "మధుశ్చ మాధవశ్చ వాసంతి కావృత్" అనే యజుర్వేద వాక్యాన్ని బట్టి వేదకాలంలో చైత్రానికి మధుమాసమని పేరున్నట్లు తెలుస్తున్నది. రుతురాజైన వసంతునికి స్వాగతోప చారాలు చేయడానికి తొమ్మిది రోజులను నిర్దేశిం చారు. ఉగాదినాడు కలశ స్థాపన చేసి, నవరాత్ర పూజ చేస్తే అపమృత్యు భయముండదని ధర్మ సింధు వివరిస్తున్నది.

వాత్సాయన కామ సూత్రాలలో ఈ ఉత్సవం "సువసంతక"మని, "మదనోత్సవ"మని పేర్కొనబడింది. రుతురాజైన వసంతుని పూజిస్తే కాలాత్మకుడైన పరమ శివుడు ప్రసన్నుడు కాగలడని భావన. వసం తోత్సవాలు తెలుగు నేలపై గొప్పగా జరిగేవి. ఉత్సవ సందర్భంగా రాజ దర్బారుల్లో ప్రతిదినం నృత్యాలు, నాట్యాలు పాట కచ్చేరీలు, పండిత గోష్టులు, శాస్త్ర విచారణలు, నాటక ప్రదర్శనలు జరిగేవి. సంగీతం ప్రధానంగా ఉండేది. ఆకాలాన ఉప యుక్తమైన వసంత రాగమును మేళకర్తలు ప్రత్యేకంగా కూర్చారు. రెడ్డిరాజుల, విజయనగర రాజుల కాలంలో ఉద్యానవనాల్లో మామిడి చెట్టుకింద మంటపం, దానిపై కలశం నెలకొల్పి పూజాపీఠంపై వసంతుని, రతీ మన్మధులను, లక్ష్మీ నారాయణులను, గౌరీ శంకరులను, శచీ పురంధరులను నెల కొల్పి, మంగళ వాద్యాల, వారాంగనల నృత్యాలు పన్నీరు, వసంతం చల్లుకోవడం, విద్యా వినోదాలు, క్రీడా ప్రదర్శనలు జరిగేవి. ప్రభువు హయారూఢుడై ఊరేగి వచ్చి, ఉద్యానవనంలో మంటపం వద్ద దేవతలను పూజించేవాడు. మంగళ వాద్యాలు, వారాంగనల నృత్యాలు, పన్నీరు, వసంతం చల్లుకోవడాలు, విద్యా వినోదాలు, వినోద క్రీడలు జరిగేవి.

## ఏరువాక ప్రారంభం

ఉగాదినాడు కొన్ని ప్రాంతాలలో ఏరువాక సాగడం ఆచారం. ఎద్దులను కట్టి దున్నుటకు సిద్ధపరిచిన నాగలిని "ఏరువాక" అంటారు. రైతులు ఉగాది నాడు తలంటి పోసుకుని, బొట్టు పెట్టుకుని, కొత్తబట్టలు వేసుకుని, నాగలికి పాత తాళ్ళు తీసి, పసుపురాచిన కొత్తవి కట్టి, నాగలికి, కాడికి రావి మండలు కట్టి, ఎడ్లకు పసుపురాసి, కుంకుమ పెట్టి పూజించి, కొబ్బరికాయ కొట్టడం సాంప్రదాయాచరణ. ఉగాది నాడు కారణాంతరాల వల్ల ఏరువాక సాగకపోతే మంచిరోజుతో ప్రారంభించ బడాలి. ఏరువాక సాగ నిదే కొత్త ఏడు ఎడ్లచేత వ్యవసాయ పనులు చేయించరు.

తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో ఈనాటి సాయంత్రం ఊరిలోని బండ్లను అలంకరించి మంచి ఎడ్లను పూన్చి కొంతదూరం ఊరేగిస్తారు. చైత్ర శుద్ధ పాడ్యమినాడు విద్యా, పౌరుష, ప్రతిపత్ తిలక, ధనావ్యాప్తి, సర్వాప్తి, చతుర్యాగ, చతుర్మూర్తి దేవమూర్తి, నదీ, లోక, శైల, సముద్ర, ద్వీప, సప్త మూర్తి, సప్తసాగర మున్నగు వ్రతాలను అచరించా లని చతుర్వర్ణ చింతామణిలో పేర్కొనబడింది.

## ఉగాది పచ్చడి

"యద్వర్షాదా నింబసుమం, శర్కరామ్ల ఘృతై ర్యుతమ్, భక్షితం పూర్వయామేస్యా, త్తద్వర్షం సౌఖ్యదాయకమ్". అని పెద్దల ఉవాచ. ఉగాది నాడు ఆ ఏటి వేపపువ్వు, చక్కెర (లేదా కొత్తబెల్లం), చింత పండు, నెయ్యి కలిపి చేసే పచ్చడిని మొదటి జాము నందే తింటే ఆ వత్సరమంతా సుఖంగా జరుగు తుందని విశ్వాసం. వేపపువ్వు ప్రధాన ద్రవ్యంగా చేసే పచ్చడి గొప్ప ఔషధంగా భావించ బడుతుంది.

**-రామ కిష్టయ్య**
**సంగన భట్ల,**
9440595494



## షడ్రుచుల పండుగ

వనమంతా ఆకుపచ్చని
అందాలు నింపుతూ
శిశిరం వెళ్లి ఆమని వచ్చింది
వేప కొమ్మల్లో చుక్కల్లా విరిసిన
వేప పువ్వులు మెరుస్తుండగా
మావిచివురులు మేసిన కోయిల
కుహూకుహూ స్వరసవ్వడులుసేయ
వగరు మామిడి పిందెల కోసం
చిన్నారులు విసిరే రాళ్ల దెబ్బలకు
నిటారుగా నిలబడ్డ మావి చెట్టు
చెరకులోని తీయదనం
మనసంతా ఆనందాల నింపగా
రుచిని నిచ్చే లవణపు ధవళకాంతి
జగమంతా మేలుకొలుపగా
క్రోధాన్నిచ్చేకారం మమకారం అవుతుంది
చింత పులుపుతో అన్నీ కలిపితే
బాంధవ్యఅందాలు ఇనుమడింపచు
షడ్రుచులు మిళితమైతేనే
అద్భుతమైన రుచి వస్తుంది
అరిషడ్వర్గాలను జయిస్తేనే
బాంధవ్యాలు నిలబడతాయి
మనిషి జీవితం
నిత్య నూతనంగా సాగాలంటే
పరాభవ
ఉగాదినామ సంవత్సరంలో
షడ్రుచుల నాస్వాదించి
ఆ పర అభవుని ఆరాధించి
ఆనంద సంతోషాలను అనుభవిద్దాం.

**-డా.మైలవరపు లలితకుమారి**
9959510422



## ఉగాది శుభారంభం

శుభారంభాల శుభ ఉగాదికి
పచ్చని తోరణాలతో స్వాగత గీతి
మామిడి కాయ వగరు, వేపపువ్వు చెదు
షడ్రుచుల సమ్మేళనం...
ఇంట్లో వాళ్లంతా కొత్త బట్టలు ధరించి
పూజలు పునస్కారాలతో భక్తిభావం
గడప గడపన వెలివిరియును...
వీధి చివరన ఉయ్యాలలు ఊగుతూ
చిన్నారుల ఆనందోత్సావాల మధ్యన
స్నేహ బంధాల, ఆత్మీయుల పలుకరింపు...
సాయంత్ర సంధ్యవేళ గుడిలో పంచాంగ
శ్రావనం వింటూ ఊరంతా ఘనంగా
జరుపుకునే పండుగ ఉగాది...
పాడి, పసిడి, ధాన్యా సిరులతో సమృద్ధి
సాధించాలని కోరుకునే ఉగాది పండుగ...
శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాదిలో
ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆశిద్దాం.

**-మిద్దె సురేష్**
9701209355



# అనంతసాగర్ లో బాల కవి సమ్మేళనం




హైదరాబాద్, మార్చి 18:తెలుగు నూతన సం వత్సర ఉగాది పర్వ దిన సందర్భంగా బుధవారం సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం లోని అనంత సాగర్ ఉన్నత పాఠశాలలో బాల కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఇందులో 20 మంది విద్యార్థులు పాల్గొని తమ కవితలు వినిపించారు. అరవై సంవత్సరాల పేర్లు విద్యార్థులు చదివి వినిపించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు కోణం పర్శరాములు పంచాంగ శ్రవణం చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, సమ్మయ్య, కవిత, దుర్గయ్య, పర్శరాములు, శ్రీమతి లు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై కొత్త పార్కింగ్ నిబంధనలు..

విజయవాడ, మార్చి 18:: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తుల రద్దీ అధికమవుతున్న నేపథ్యంలో వాహన రాకపోకలను నియంత్రిం చేందుకు కొత్త పార్కింగ్ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. శుక్ర, శని, ఆదివారాలు పండుగ రోజుల్లో ఈ నిబంధనలు కఠినంగా అమలు చేయనున్నారు. భక్తులకు సౌకర్యం కల్పించడంతో పాటు భద్రత, రద్దీ నియంత్రణ ప్రధాన లక్ష్యాలుగా అధికారులు స్పష్టం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీలైన న్యాయమూర్తులు, మంత్రులు, క్యాబినెట్ హోదా కలిగిన వారి వాహనాలకు మాత్రమే డోనర్ సెల్ వరకు అనుమతి ఉంటుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వంటి ఇతర వీఐపీల వాహనాలు రిసెప్షన్ ప్రాంతంలోనే నిలిపివే యాల్సి ఉంటుంది. ఇతర రిఫరల్ వాహనాలన్నీ తప్పనిసరిగా ఓం టర్నింగ్ వద్దే పార్క్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

వృద్ధులు, దివ్యాంగులు, వీఐపీలు, ప్రత్యేక అవసరాలున్న భక్తుల కోసం ఓం టర్నింగ్ నుంచి ఆలయానికి ఉచిత బ్యాటరీ వాహనాల సేవ అందుబాటులో ఉంచారు. ఇది భక్తులు సులభంగా కొండపైకి చేరుకునేలా చేయడంలో కీలకంగా మారనుంది.

కనకదుర్గమ్మ దర్శనానికి పండుగలు, వారాంతాల్లో రద్దీ అధికంగా ఉండటంతో కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డుపై కేవలం ఒకే వరుస వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాల నివారణకు దోహద పడుతుందని అధికారులు భావిస్తున్నారు. అమ్మవారి ఆలయ శాశ్వత అర్చకులు స్థానిక ప్రెస్ ప్రతినిధులకు ద్విచక్ర వాహనాలను ఘాట్ రోడ్డుపై సింగిల్ రోలో పార్క్ చేసుకునే అనుమతి కల్పించారు.


ఆహ్వానం
కవిసంధ్య కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ
యానాం - హైదరాబాద్
భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
సంయుక్త నిర్వహణలో
ప్రపంచ కవితా దినోత్సవం -2026
22 మార్చి 2026 ఆదివారం, సా. 5.30కి రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాలు
కవిసంధ్య - సుధామ కవితల పోటీ బహుమతుల ప్రదానం
తెలుగులో యుద్ధ కవిత్వం పై ప్రత్యేక ప్రసంగం
కవిసంధ్య-59 - చందు సుబ్బారావు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ
ముఖ్య అతిథి: శ్రీ కె. శివారెడ్డి, సరస్వతి సమ్మాన్ అవార్డు గ్రహీత
గౌరవ అతిథి: శ్రీ జింబో (మంగారి రాజేందర్) జిల్లా జడ్జి, రిటైర్డ్
సభాధ్యక్షులు: డా.శిఖామణి, కవిసంధ్య సంపాదకులు
విశిష్ట అతిథి-కవిసంధ్య-59, చందు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ:
డా.ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్
డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
బహుమతుల సౌజన్యం: శ్రీ సుధామ, ప్రముఖ కవి, రేడియో ప్రయోక్త
కవితల పోటీ నివేదిక: కళారత్న దాట్ల దేవదానం రాజు, పోటీల కన్వీనర్
ప్రత్యేక ప్రసంగం: ఆచార్య కోయి కోటేశ్వరరావు, ప్రముఖ కవి, విమర్శకులు
అంశం: తెలుగులో యుద్ధ కవిత్వం
ఆత్మీయ అతిథులు:
శ్రీ సన్నిధానం నరసింహ శర్మ, ప్రముఖ సాహితీవేత్త
శ్రీమతి శీలా సుభద్రా దేవి, ప్రముఖ కవయిత్రి
శ్రీ యార్లగడ్డ రాఘవేంద్ర రావు, ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్
శ్రీ సి.ఎస్.రాంబాబు, ప్రముఖ కవి రేడియో ప్రయోక్త
డా.జి.వి.రత్నాకర్, ప్రముఖ కవి, మౌలానా అజాద్ కేంద్రీయ ఉర్దూ యూనివర్సిటీ.
శ్రీ పి.శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ కవి, అనువాదకుడు
ఆహ్వానం: శ్రీ చల్లా రామఫణి, ప్రముఖ కవి
సభాసమన్వయం: శ్రీ అరిగెల రాజు, కవిసంధ్య హైదరాబాద్ కన్వీనర్
దాట్ల దేవదానం రాజు
కన్వీనర్, పురస్కార కమిటీ, 9440105978
శిఖామణి
అధ్యక్షులు, కవిసంధ్య, 9848202526


# పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

**-అల్ మేవా ను అభినందించిన జిల్లా కలెక్టర్**
**-పేదలను ఆదుకోవాలి**
**-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు మార్చి 18:ముస్లిం మైనారిటీ ఉద్యోగుల సంఘం ద్వారా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఆల్ మైనారిటీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కలెక్టర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. పండును సంతోషంగా జరుపుకోలేని స్థితిలో ఉన్న సుమారు 200 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ప్రతి లబ్ధిదారునికి రూ.600 విలువైన నిత్యావసర సరుకులు (బియ్యం, కిరాణా) మరియు పాలు, స్వీట్లు వంటి పండుగ ఖర్చుల కోసం రూ.400 నగదును కలిపి మొత్తం రూ.1000 విలువైన తోఫాను అందచేయడం జరిగిందన్నారు.

పేదలను ఆదుకోవడం పుణ్య కార్యక్రమమని ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్, జిల్లా ముస్లిం మైనారిటీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ముక్తియార్ బాషా, జనరల్ సెక్రెటరీ రియాజ్ బాషా, వైస్ ప్రెసిడెంట్ జాకిర్ హుస్సేన్, ఫైనాన్స్ సెక్రటరీ షఫీ అహ్మద్, ఉమెన్ సెక్రెటరీ సహారా భాను, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జమిల్ ఉద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సఫియుల్లా బైగ్, అబ్దుల్ కాలిక్, ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ శక్తి ఉచిత బస్సు ప్రయాణంతో కొత్త దిశ

**-దివ్యాంగుల ఆత్మవిశ్వాసానికి ఊతం**
**-సమాన అవకాశాల దిశగా కీలక అడుగు**
**-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



అమరావతి, మార్చి 18:నందిగామ పట్టణంలో దివ్యాంగ శక్తి కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా జరిగింది. సమాజ ప్రగతికి సమాన అవకాశాలే పునాది అన్న సంకల్పంతో దివ్యాంగుల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి నందిగామ కొత్త బస్టాండ్ నుంచి కంచికచర్ల బస్టాండ్ వరకు దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న దివ్యాంగులతో కలిసి చేసిన ఈ ప్రయాణం వారికి మరింత ఉత్సాహం నింపింది.

ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, దివ్యాంగుల సామర్థ్యాలను గుర్తించి వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వారి రోజువారీ జీవితం సులభతరం కావడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగుల పట్ల సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు, వారికి మరింత గౌరవం కల్పించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

# విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

## షేర్ మహమ్మద్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

అమరావతి, మార్చి 18: జగ్గయ్యపేట మండలం, షేర్ మహమ్మద్‌పేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచి, పరిశుభ్రత, పోఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ? రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం స్కీం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు చదువుపై ఆసక్తి పెంచేలా చర్యలు



తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే వారు చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పాంశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ సమయంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మెనూ ప్రకారం పోషకాహారం వండి విద్యార్థులకు సమయానికి అందించాలని వంట సిబ్బంది సంబ ంధిత అధికా రులకు సూచించారు. పిల్లల ఆరో గ్యం, చదువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అలాగే పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు సక్రమంగా చదువుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహించారు.

# శివశక్తి సమన్వితం “శ్రీ పరాభవ”

## పండుగ ప్రస్తావన :

శ్రీ ‘పరాభవ’ నామ ఉగాది! నీ రాక శ్రీకరం, శుభకరం. ఈశ్వరానుగ్రహముగా తలచి, రాబోతున్న ఏడాది కాలానికి జరుపుకునే ఉగాది కాలగణనలో ఇది కేవలం ఒక సంవత్సరాన్ని సూచించే పేరు మాత్రమే. జ్యోతిష్య శాస్త్ర ప్రకారం ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక స్వభావం, పరిస్థితులను సూచిస్తుందని విశ్వసిస్తారు. “పరాభవ” నామ వత్సరానికి పరాక్రమ భావముగా పండిత ఉవాచ. తెలుగు గణనలో 60 సంవత్సరాల కాలచక్రం ఉంటుంది. ఆ వరుసలో పరాభవ 40వ సంవత్సరం. ఈ నవనవోన్మేష శ్రీ ‘పరాభవ’ నామ వత్సరమా ! స్వాగతం, సుస్వాగతం. కొత్త ఆశల ఆరంభంగా ఉగాది పండుగకు ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. ఉగాది పండుగ ప్రకృతి సోయగాలతో ముడిపడి ఉంటుంది. వసంత రుతువు ప్రారంభంతో ప్రకృతి పచ్చని చిగురులతో కొత్త అందాన్ని సంతరించుకుంటుంది. మామిడి చిగురుల పచ్చదనం, పూల పరిమళాలు, కోయిలల కుహూకుహూ గానాలు, ప్రకృతిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. ఈ అందమైన వాతావరణం మనసుకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఒక్క తెలుగు సాంప్రదాయంలోనే కాక మరాఠీలు గుడి పడ్వాగానూ, తమిళులు పుత్తాండు అనే పేరుతో, మలయాళీలు విషు అనే పేరుతోను, సిక్కులు వైశాఖీగానూ, బెంగాలీలు పొయ్‌లా బైశాఖ్ గానూ జరుపుకుంటారు. ఉగాది అచారాలుగా ఈ రోజున వేపపువ్వు పచ్చడి, పంచాంగ శ్రవణము, మిత్రదర్శనము, ఆర్యపూజనము, గోపూజ, ఏరువాక అనబడే ఆచారాలు పాటించడం ఆనవాయితీ.

## ఉగాది పచ్చడి సేవనం :

“ఉగాది” పర్వదినాన రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు తెల్లవారుజామునే లేచి ఇళ్లను శుభ్రపరచి, ఇంటి ముంగిట రంగవల్లులు, గుమ్మానికి మామిడి ఆకుల తోరణాలు కడతారు. తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి ఇంటిల్లిపాది దేవి దేవతలను పూజిస్తారు. ముఖ్యంగా “ఉగాది పచ్చడి” తయారు చేయడం ఒక ప్రత్యేక సంప్రదాయం. షడ్రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడిని సేవించడం తెలుగు వారి ఆనవాయితీగా ఇందులో ఉండే ఆరు రుచులు తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారము, వగరు జీవితం అనేక అనుభవాల సమ్మేళనంగా భావిస్తారు. ఆ ఏడాది అనుభవాలను క్రమంగా స్వీకరించాలని సుఖం, దుఃఖం, ఆశ, నిరాశ వంటి అనుభవాల్ని ఉగాది పచ్చడి సేవనం బోధిస్తుం దన్నది సందేశం. పరాభవనామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రతి ఇంటిలో సంతోషాలు నిండాలని, ప్రతి హృదయంలో ఆశలు మొలకెత్తాలని తెలుగు ప్రజల సంప్రదాయం ప్రకారం శ్రీ ‘పరాభవ’ నామ ఉగాది! అందరి కోరికల్ని తీర్చేందుకు, ఏడాది పొడుగునా జీవితంలో చవి చూసే అనుభవాలకు తార్కాణంగా, షడ్రుచుల సమ్మేళనంగా ఉగాది పచ్చడిని సేవించడం తెలుగు వారి ఆనవాయితీగా బెల్లం - తీపి ఆనందానికి సంకేతంగా, ఉప్పు- జీవితంలో ఉత్సాహంగా ఉండేందుకు, వేప పువ్వు - చేదు జీవితంలో ఎదుర్కొనే భాధలకు సంకేతంగా, చింతపండు - పులుపు నేర్పుతో చాకచక్యంగా వ్యవహ రింపవలసిన పరిస్టితులను తట్టుకుని నిలబడే ఆత్మస్థై ర్యాన్ని, పచ్చిమామిడి ముక్క లు - వగరు కొత్త సవాళ్ళు ఎదుర్కోకలగటం కారం - సహనం కోల్పోయేలా చేసే పరిస్తితులు నివారించే గుణాది విశేషాలు కలగలిపిన షడ్రుచుల ఉగాది పచ్చడిని వసంత మాసంలో పుచ్చుకోవడం అనాదిగా తెలుగు వారికి తరతరాల సంప్రదాయంగా మారింది. దానితో పాటు మానవ శరీరంలో పేరుకుని ఉన్నవాత, పిత్త, కఫాదులను దునుమాడి మనిషిని ఆయురారోగ్యవంతుడుగా మార్చేందుకు దోహదపడుతుందని ప్రతీతి.



## ఉగాది పురాణ ప్రాశస్త్యం :

ఉగస్య ఆది: “ఉగ” అనగా నక్షత్ర గమనము - జన్మ ఆయుష్షు అని వీటికి ‘ఆది’ ‘ఉగాది’అనగా ప్రపంచం యొక్క జన్మఆయుష్షులకు మొదటి రోజు కనుక ఉగాది అయినది. ‘యుగము’ అనగా రెండు లేక జంట అని కూడా అర్థం. ఉత్తరాయణ, దక్షణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం ‘యుగము’(సంవత్సరం) కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయింది. అదే సంవత్సరాది. ఉగాది వసంతములకు విడదీయరాని బంధం. సూర్యునికి, సకల ఋతువులకు ప్రాతః సాయం కాలాది త్రికాలములకు ఉషాదేవతయే మాతృ స్వరూపం. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణాల్లో చెప్పబడింది. కలియుగం ప్రమాది నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమైంది. ఈ కల్పం ప్రారంభమై 197,29,49,114 ఏళ్లు పూర్తి అయినట్లుగాను ఇప్పుడు వైవస్వత మన్వంతరంలోని కలియుగంలో ఉన్నామంటారు. యుగమునకు ఆది యుగాది, అలాగే ఈ పండుగకు ఇతిహాస ప్రాముఖ్యతను కలిగి ఉండటం విశేషం. త్రేతాయుగములో శ్రీరామచంద్రుడు అరణ్యవాసం ముగించుకుని అయోధ్యకు చేరి, ఉగాదిరోజున పట్టాభిషేకం జరిగినదని ఇతిహాసాలు చెబుతున్నాయి. అలాగే శాలివాహన శకారంబం కుడా ఇదే రోజున ప్రారంబించబడినదని చరిత్ర చెబుతోంది. ఉగాది ప్రాముఖ్యం చైత్ర శుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ సృష్టిని నిర్మించడం ప్రారంభించారని నమ్ముతారు. మత్స్యావతారము ధరించిన విష్ణువు సోమకుని సంహరించి, వేదాలను బ్రహ్మకప్పగించిన సందర్భంగా ‘ఉగాది’ ఆచరణలోకి వచ్చెనని పురాణప్రతీతి. బ్రహ్మదేవుడు ఈ జగత్తును చైత్ర మాస శుక్లపక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా సృష్టించాడంటారు. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఈనాడు ప్రవర్తింప చేసాడన్నది పెద్దల భావన. అంతే కాదు వసంత ఋతువు కూడా అప్పుడే మొదలవుతుంది. పురాణాలకాలం నుంచి “ఉగాది” పర్వదినాన ప్రధానంగా చేయవలిసిన విధులున్నాయనీ, అందులో మొదటిది సూర్యోదయానికి ముందే నువ్వులనూనే తలకు పెట్టుకుని, శరీరానికి సున్నిపిండితోనూ కుంకుడు కాయల రసముతో తలంటు స్నానం చేయడం, నూతన వస్త్రాలను ధరించడం రెండోవ విధిగా ఆ తదుపరి షడ్రుచుల సమ్మేళనంగా తయారు చేసిన ఉగాది పచ్చడిని నైవేద్యంగా లక్ష్మీదేవి, ఇతర దేవి దేవత మూర్తులకు సమర్పించి, ఇంటిల్లిపాది సేవించడము, తద్వారా లక్ష్మీదేవి, ఇతర దేవిదేవతా మూర్తుల అనుగ్ర హం అనంతరం పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం సంప్రదాయంగా పేర్కొంటారు. తరతరాల తెలుగు వారు సంస్కృతి, సంప్రదాయాల విలువల ప్రాముఖ్యతను గుర్తించి, వృత్తిరీత్యా, ఏ దేశాలలో ఉన్నా, ఆచరిస్తూ, సంప్రదా యంగా వాటిని నిలబెట్టడం ముదావహం.

## పంచాంగ శ్రవణం:

ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడం కూడా ఒక ముఖ్యమైన సంప్రదాయం. పండితులు కొత్త సంవత్సరంలో గ్రహాల స్థితి, వర్షపాతం, వ్యవసాయం, ప్రజల జీవన విధానాల గురించి వివరాలు చెబుతారు. దీనివల్ల ప్రజలు కొత్త సంవత్సరాన్ని ఆశతో, విశ్వాసంతో ఆహ్వానిస్తారు. పరాభవ నామ సంవత్సర ఉగాది జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని, కొత్త ఆశలతో ముందుకు సాగాలని ఇది సూచిస్తుంది. ప్రతి సంవత్సరం మనకు కొత్త అవకాశాలను, కొత్త అనుభవాలను అందిస్తుంది. అందుకే ఉగాది పండుగ మన సంస్కృతిలో కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; అది మన జీవితాల్లో కొత్త ఆశలకు, ఆనందాలకు ప్రతీక. శ్రీ ‘పరాభవ’ నామ ‘‘పంచాంగ శ్రవణం.’ ఉగాది రోజు దేవాలయంలో గానీ, గ్రామ చావడిలో గానీ, కూడలిలో గానీ, ఇంట్లో అయితే యజమానే స్వయంగా, పంచాంగ శ్రవణాన్ని చేయడం ఆచారం. ‘పంచాంగం’ అంటే ఐదు అంగాలని అర్థం. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనేవి ఆ ఐదు అంగాలు! ఈ ఐదింటితో కూడిన పంచంగాన్ని - ఉగాది రోజున వివిధ దేవతలతోపాటు పూజించి, పంచాంగ శ్రవణం చేయాలి. “పంచాంగ శ్రవణం’ చేసేటప్పుడు ఉత్తరాభిముఖంగా కూర్చుని వింటే మంచిదని పండితులు చెబుతుంటారు. “పంచాంగ శ్రవణం’ చేసినవారికీ, విన్న వారికీ కూడా సూర్యుడు శౌర్యాన్ని, తేజస్సునీ, చంద్రుడి వైభవాన్నీ, కుజుడు సర్వమంగళాలనూ, బుధుడు బుద్ధివికాసాన్నీ, గురుడు గురు కృపనూ, జ్ఞానాన్నీ, శుక్రుడు సుఖాన్నీ, శని దు:ఖరాహిత్యాన్నీ, రాహువువల్ల ప్రాబల్యం, కేతువు ప్రాధాన్యతా లభింపచేస్తారు. “పంచాంగ శ్రవణం’లో ముఖ్యంగా సంవత్సర ఫలితాలు తెలుసుకోవాలన్న ఆత్రుత ఎక్కువగా కనపడుతుంటుంది. ఈ ఉగాది శ్రీ ‘పరాభవ’ నామ ఉగాది! తెలుగు సంవత్సరాలలో వచ్చే 40వ సంవత్సరం గాను, “పరాభవ” నామ వత్సరానికి పరాక్రమ భావముగా పండిత ఉవాచ. జ్యోతిష్య శాస్త్ర ప్రకారముగా చూసినప్పుడు, ఈ సంవత్సరంలో జన్మించిన వారు కళల్లో విశేషంగా రాణిస్తారని, సృజనశీలురై ఉంటారనీ, వివిధరకాల వస్తువుల్ని సేకరించే అలవాటు ఉంటుందనీ, నిరంతరం ఆలోచిస్తూ ఉంటారనీ, అతిగా మాట్లాడే అలవాటు ఉంటుందనీ, స్నేహంపట్ల అంతగా విశ్వాసం ప్రకటించరనీ, కొంత పిరికితనం కూడా ఉండే అవకాశం ఉందనీ శాస్త్రం ఘోషిస్తోంది. సంవత్సరపరంగా చూసుకున్నప్పుడు ఈ సంవత్సరంనకు కళలు, సృజనాత్మక శక్తి, రచయితలకు కళాకారులకు మంచి స్ఫూర్తిదాయకమైనది.

## కవి సమ్మేళన విందు పసందు :

కవులు, కవయిత్రులకు శ్రీ ‘పరాభవ’ నామ ‘ఉగాది’ కీలకంగా మారనుంది. కవి సమ్మేళన సందళ్ళ సరంభం, కవుల వర్ణనలో వసంత రుతు శోభను వర్ణిస్తూ ‘క్రొత్తగా జతకట్టిన కోకిలమ్మ, మావి లే చిగుళ్ల మాధుర్యాన్ని ప్రస్తుతించారు. బమ్మెర పోతనదీ అదే దారి ‘బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్య కన్యక’గా తన భాగవతాన్ని భావన చేశాడు. తీపి, పులుపు దాని తీరు చూడ’ అన్నారొక అవధాని. వసంతకోయిల శ్రావ్యంగా కూయాలన్నా, ఆమ్ర కిసలయమే (లేత చిగురు) దానికి అనువైన ఆదరువు. ఉగాదికి నాకవితా పలుకులు ...

నమోస్తు “శ్రీ పరాభవ”

ప్రకృతి కాంతి సోయగం రమణీయం, కమనీయమై కనువిందు చేసింది.

వృక్ష భాషలో పలకరించాను, పలవరించాను, పరవశించాను.

కోయిల కుహు కుహు పూజితాలు, మామిడి చిగురుల మందహాసాలు,

మది నిండా మధురానుభూతులు. మది గదిలో మెదిలిన భావాలు, గుండె గుడిలో గూడు కట్టిన గీతాలాపనలయ్యాయి.

అక్షర మందారాలతో కవిత మాలికలు, అల్లాలని కలం పట్టుకొని కదిలాను.

హరిత చేలాంచలాల పలుకులందుకు, దివ్య హారతులు సిద్ధం చేశాను.

కావ్య వీణాపాణి కరుణతో, భవ్య కృతుల పయస్సులో, షడ్రుచులు రంగరించాను.

నవనవోన్మేష కోరికల ఈరికలతో ఆశల ఊసులతో రా రావమ్మ పరాభవ.

శిశిర విషమారుత విశీర్ణ వృక్షాంగనలకు, హరిత వసనాలు అందిస్తూ ,

రా పరాభవ వసివాడిన జీవితాలకు షడ్రుచులు నందింప చైత్ర యాత్ర సాగింపుము పరాభవ.

క్రొమ్మావి కొమ్మల కమ్మని చిగురులు కోయిలకు రుచి చూపిస్తూ,

కొంజివురాకుల తోరణాలతో, గుండుమల్లెల హారాలతో, బిరబిరా రావమ్మా రసరాగ పరాభవ.

అష్టవసువుల కృపతో, పుడమి తల్లిని పునరుద్ధరింపగా, ధర్మానికి ఆదిగా,

సంస్కృతికి పునాదిగా కవన వేదికగా కందళించు పరాభవ.

వత్సరాలలో విలక్షణం, నిత్య చైతన్యం నీ యశస్సు. ఫలించునులే, హరిత చరితార్థ ప్రకృతి కాంత తపస్సు.

నీ వర్ణార్ణవ శోభకు పోటీ పడగలదా? ఇంద్రధనుస్సు

షడ్రుచుల సమతౌల్యం గాక కించిత్ తీపి పెంచమంటోంది నా మనసు.

కలిత లలిత చకిత మహిత హరితాంబర సుందర రోచిస్సు,

సమతలోని సౌందర్యం, మమతలోని మాధుర్యం ఆ ఉషస్సు.

నూతన కిరణాల ఆవిష్కరణలే అలంకరణలుగా విచ్చేయు పరాభవ అస్తు...

విజయోస్తు... దిగ్విజయోస్తు... నమస్తేస్తు... భమస్తు.



-శారదా శృంగేరి
94902 61119

## పచ్చని తోరణం

ఒక పలకరింత...
వసంతాగమనంతో
ప్రకృతి కాంత తనువంతా
ఒక పులకరింత...

మావి చిగురు చిరు నగవు
కోయిలమ్మ సిరి పిలుపు
కాలం మది పలికే
కమ్మని కలవరింత..

చైతన్య విపంచి రెక్కల సడి ఇది
చైత్ర విరించి విరచించే

మమతల గీతి ఉగాది..
తిమిర కుహరం నుంచి
ప్రభవించే ఉషస్సులా
శిశిర గర్భం నుంచి
పల్లవించే వాసంత స్వరం ఉగాది

ఈ పర్వ దినం అమ్మతనపు
అమృత నయనాల వెలుగై
పరుచుకుంటే....
ప్రతి ఎదలో అరుణ చరణాల
ఆనంద నృత్యం తళుకుమంటే...
అది నూత్న వత్సరాది...

చెరువు-తరువు చేను చెలక
వెల్లువెత్తే ప్రాణ గీతానికి చరణాలు..

ఆ పలకరింతల తొలి సంబరం ఉగాది
పులకరింతల పుడమి సంతకం ఉగాది,
పరాభవ నామ సంవత్సరం గా
పిలవబడే ఈ ఉగాది
దుర్మార్గులకు పరాభవం చూపించాలని..
రైతు వెతలను శ్రమ జీవుల కన్నీళ్లను కలిగించాలని..
ఆశ పడే కవి కోకిలల చిరు ఆశా కిరణం ఉగాది.
ప్రకృతి కాంత వెలుగుల తోరణం ఈ ఉగాది..



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## ఉగాది ఉవాచ

తీపి ఆనందం
చేదు ఛీత్కారం
పులుపు వెటకారం
వగరు చమత్కారం
ఉప్పు ఉత్సాహం
కారం అవమానం..
ఉగాది ప్రసాదం
షడ్రుచుల సమాహారం
అదే మనిషి జీవన సారం
కాలచక్రంలో ఇవన్నీ క్షణికాలే
పరాభవాన్ని అధిగమిస్తే
మున్ముందు అన్నీ విజయాలే!



-చెన్నాప్రగడ శర్మ
9440587567

## చెడుకు పరాభవం కావాలి..!

చెడుకు పరాభవం కావాలి
గెలుపుకు పూర్వ వైభవం తేవాలి
ఓటమికే పరాజయం రావాలి
విజయానికి చిద్విలాసం కావాలంటూ
పరాభవం నామ సంవత్సరాన్ని
తెలుగు వారంతా సాదరంగా
ఆహ్వానిద్దాం...!.
పేరులోనే పరాభవముందని
తీరుకూడా అలాగే వుంటుందని
ఆందోళన పడకండి ఆంధ్రులారా..!.
ఎన్ని పరాభవాలు వచ్చినా
ఘోర అవమానాలు ఎదురైనా
రాజ పూజ్యాలు మనకు ఎక్కువే..!.
వ్యయాలు అధికమైనా
ఆదాయాలు తక్కువైనా

పరాభవంలో వచ్చేది ప్రాభవమే..!.
ఆరు రుతువుల కౌముది
ఆరు రుచులతో పచ్చడి
చిగురాశలకు పునాది వేస్తూ
నిరాశలను సమాధి చేస్తూ
పరాభవం నామ యుగాది వచ్చే...!
ఈ పరాభవ నామ సంవత్సరం
యుద్ధానికి పరాభవం కావాలి
ఉన్మాదులకు పరాజయమవ్వాలి
అప్పుడే విశ్వశాంతికి మనశ్శాంతి
తెలుగువారికి నిజమైన విజయ క్రాంతి..!



-జి.సూర్యనారాయణ,
6281725659.

## షడ్రుచుల మేళవింపుల ఉగాది పండుగ

చైత్రమాస శుక్లపక్షం పాడ్యమితిథి
ఉత్సాహం నింపే ఉగాది తెలుగు నూతన సంవత్సరారంభం
జనులందరికీ సంబరాల షడ్రుచుల సంబరాల సందడి.
చిగురించిన మోళ్లతో ప్రకృతి చిందులు వేయగా
శుకపికాల సౌరంభం
కోకిలమ్మ కుహు కుహు పాటలతో
గున్న మామిడి గుంబనాల నవ్వులతో
ఆకుపచ్చ అందానికి వన్నెలందించే వేపపూతలతో
మారిన ఋతువులతో మది, మదికి
సంతసాలనందించే పచ్చని ప్రకృతి యుగాది.
షడ్రుచుల మేలవింపులే
తీపి, పులుపు, వగరు, చేదు ,కారం ఉప్పుల సమ్మేళనమే
ఉగాది పచ్చడి
తీపి మాటలతో తిమ్మినిబమ్మి చేయక
తేనె పూసిన కత్తుల్లా కలవరపరచక
తీపిని పంచుతూ...
తీయటి కబుర్లు అందిస్తూ మసులుకోమంటుంది తీయనైన రుచి.
పుల్లవిరుపు మాటలతో మదిని బాధించక
పులిహోరలోని పులుపులా అందరినీ కలుపుకుంటూ
జీవితాన్ని సాగించమంటోంది నోరూరించే పుల్లనైన పులుపు .
ఎదిగీ,ఎదగని మామిడికాయల వగరు
జిహ్వను జివ్వుమని పించినట్లు
తెలిసీ, తెలియని మాటలతో
పరులను బాధించక
పక్వానికి వచ్చే పండులా
మది,మదిని గెలవమంటోంది వగరైన రుచి
చేదుకు చేబదులందించినట్లు
ఎదను మురిపించే వెల్లువైన వేపపూత
తినగా తినగ వేము తీయగా నున్నట్లు
చేదుతో చెలిమి చేసి,
తీపిని పంచమంటుంది చెరగని
చేదైన రుచి

కారాలు మిరియాలులా కష్ట,నష్టాలు వెన్నంటి ఉన్నా
కమ్మని పాటలతో ప్రకృతిని పరవశింప చేసే కోకిలలా
పరులకు సాయమందించమంటోంది కారమైనా ....
మమకారం
అన్నేసి చూడు నన్నేసి చూడమంటున్నది ఉప్పు
ఉర్వీజనుల అవసరాలకు మెప్పు
ఉప్పెక్కువైనా, తక్కువైనా తట్టుకోలేనట్లే
సంయమనంతో కుటుంబాలను
ఆరు రుచుల ఐక్యతలా
కలిసుండమంటూ...పరాభవాలను పాతిపెట్టి
విజయమే ధ్యేయంగా అడుగు వేయమంటుంది
‘శ్రీ పరాభవ’
నామ ఉగాది’ సంవత్సరం.



-డా. బండారి సుజాత
9959771228

## పరాభవ

ఎవరికి జరిగినది పరాభవం
ఎక్కడ జరిగినది
నిజంగా జరిగినది పరాభవమేనా
మరి జరుగుతున్నదేమిటి
ప్రపంచం పరుగులిడుతున్నదెటువైపు
పరిస్థితులు అనుకూలిస్తున్నదెవరికి.
క్రోధి వచ్చి చెప్పి వెళ్లింది కదా
కోపాన్ని దూరం పెట్టమని
మనసు లో శాంతి పెంచి
మనుషులు మంచి మార్గం నడవమని.
విశ్వావసు వచ్చి నేర్పింది కదా
విశ్వానికంతా మేలుచేయమని
ప్రేమతో అందరితో కలిసి
సంతోషంగా జీవించమని.
పరాభవ ఏం చెప్ప బోతుంది మనకు
ఓటమి చూసి భయపడవద్దని
పాఠం నేర్చుకొని ముందుకు సాగితే
విజయం చెంతకు వచ్చి చేరుతుందని కాదా!.



-రామసుగుణాకర్ రాజు
కాంచనపల్లి
9849375831

## ఉగాది ప్రియ వచ్చిందట కదా

చీకటి చిట్లించిన రాత్రి
తెల్లవారిన రవికిరణాలు తాకలేని
నేల మీద....,
గోసి మాత్రమే ఉన్న ఒంటితో
బోర్లపడి ఓ తెల్ల కాగితం మీద,
నాలుగు నల్లటి అక్షరాలు
గుండె కుది పి గింజలు చల్లాను.
రోజు వాలే పెట్టలే కాకుండా...,
ఎన్నో పక్షి జాతి రక్తసంబంధికులు
ఒక్కొక్కటి నా ముఖం ముందు వాలి,
నా రెప్పలతో ఏదో
మూగ సంభాషణ చేస్తున్నాయి.
....
ఆశ్చర్యం ఎ ఒక సింహం మాత్రం
తన లేత పిల్లలతో వచ్చి
ఒక వాక్యం మీద, తన రాజ దర్పం ప్రదర్శించింది.
ఇది ఏదీ చూడనట్లు, ఏమీ పట్టనట్లు పక్షులు
పక్షులు కదా అవి,
ఏమీ బెదరకుండా సంభాషిస్తూనే ఉన్నాయి.

ఇప్పుడు.....
నాలో పక్షులు, సింహవ
దాని సంతతి తో సహా
లోపలికి ప్రవేశించాయి.
ఇక మార్మికము తొలగించే పద్యం
పురుడుపోసుకోవడమే
ఆలస్యం.
..
ఉగాది ప్రియా వచ్చిందట కదా ఎ
కవి, కవి లాంటి ప్రకృతి ప్రియురాలు
ప్రేమలేఖ కోసం.....,
చంద్రుని తెంచుకొని ముఖానికి పూసుకున్న
యవ్వన దళిత యువతి పాదాలు తాకని
వసంత భూమి పాయలకు....,
ఉగాదిపియ వచ్చిందట కదా.
పద్యం కానుక
ఇవ్వాలి కదాశ్రీ



-జనజ్వాల
9949163770

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com